Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 26.12.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 30 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


www.lawyerteluguweekly.com

2015 **శుభాకాంక్షలు** 2015

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
**నూతన సంవత్సర శుభాకాంక్షలు.** - సం/-



# భారత జాతి రత్నాలు



- **జాతిని జాగృతి పరచిన మహనీయులకు అత్యున్నత పురస్కారాలు**
- **మదన్‌మోహన్ మాలవ్య, మాజీప్రధాని వాజ్‌పేయిలకు 'భారతరత్న'**

భరతమాత ముద్దుబిడ్డలైన ఇద్దరు మహనీయులకు భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన 'భారత రత్న' అవార్డులను ప్రకటించింది. ఆ మహనీయులు దేశానికి చేసిన విశిష్టమైన సేవలకు విశేషమైన గుర్తింపునిచ్చింది. ఈ పురస్కారాలకు ఎంపికైన ఇద్దరూ మానవతామూర్తులే. ఒకరు పండిట్ మదన్‌మోహన్ మాలవ్య..మరొకరు మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పేయి. ఇద్దరూ మహోన్నతమూర్తులే. ఇద్దరూ మానవత్వం పరిమళించిన మంచిమనుషులు.. మహోన్నత మానవతా దీప్తులే. ఒకరు మాతృభూమి స్వేచ్ఛ కోసం పరితపించిన స్వాతంత్ర్యయోధులైతే, మరొకరు దేశమాత సేవకు జీవితాన్ని అంకితం చేసిన రాజకీయయోధులు. ఒకరు మహావిద్యావేత్త అయితే, మరొకరు మహోన్నత రాజకీయవేత్త. భరతజాతి గర్వపడేవిధంగా, జాతిరత్నాలుగా ప్రకాశించిన వీరిద్దరికీ 'భారత రత్న' అవార్డులు ప్రకటించడం దేశానికే గర్వకారణం. (మిగతా 10వ పేజీలో)



## ప్రతిపక్షం దాడికి...
# ప్రభుత్వం విలవిల

శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు మొక్కుబడిగా సాగాయి. సభలో ప్రజా సమస్యల మీద చర్చకంటే కూడా సమస్యలపై చర్చను పక్కదారి పట్టించడానికే అధికారపార్టీ ఎక్కువగా ప్రయత్నించింది. ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు అడ్డగోలు సమాధానాలు, వితండవాదనలు చేయడం తప్పించి, ప్రతిపక్షం దాడిని ప్రభుత్వం అర్థవంతంగా ఎదుర్కోలేకపోయింది. (మిగతా 10వ పేజీలో)



# జగన్ విమర్శలు బాధాకరం

## టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ప్రతిపక్షం నిర్మాణాత్మక పాత్ర పోషించాలే తప్ప, అనుచిత విమర్శలు చేయడం సముచితం కాదని, అసెంబ్లీలో జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు మాట్లాడిన తీరు, వారు చేసిన విమర్శలు ఎంతో బాధాకరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అసలు, వైకాపా అధినేత జగన్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగే హక్కు లేదని ఆయన విమర్శించారు.

ఈ నెల 20న వెంకటగిరిలో డాక్టర్ శేషమనాయుడు, చెలికం మధురెడ్డిలను సోమిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుద్‌హుద్ తుఫాన్ బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, అన్నం పొట్లాలు ప్రభుత్వం విసిరేసిందని మాట్లాడడం దారుణమని, జగన్ లాంటి ప్రతిపక్ష నేత దేశచరిత్రలోనే లేరని సోమిరెడ్డి విమర్శించారు. పలు కేసులు కోర్టు విచారణలో వున్న వ్యక్తి, ప్రతిపక్ష పార్టీ అధ్యక్షునిగా వుండడం సమంజసం కాదని, కోర్టు తీర్పు వచ్చేవరకు ఆ పదవులు వదులుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రగతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని, అలాంటి ముఖ్యమంత్రిపై లేనిపోని విమర్శలు చేయడం సముచితం కాదన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, నదులను అనుసంధానం చేయడం, ఓడరేవుల అభివృద్ధి తదితర విషయాలన్నిటిపై దృష్టి కేంద్రీకరించారని సోమిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చెలికం శంకరరెడ్డి, పి.రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కెవికె ప్రసాద్, డక్కిలి ఎంపిపి వెంకటరెడ్డి తదితరులు వున్నారు.

# విద్యుత్ బకాయిలను రాబట్టాలి


## - డిస్కం సిఇ నందకుమార్

జిల్లాలో విద్యుత్ బకాయిలు సుమారు 115 కోట్ల రూపాయల దాకా వున్నాయని, తిరుపతి రీజియన్‌లోని నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో మొత్తం దాదాపు 324 కోట్ల దాకా బకాయిలు వున్నాయని, ఈ బకాయిలను రాబట్టేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని డిస్కం సిఇ నందకుమార్ అన్నారు. గూడూరు మండలంలోని నెల్లటూరు విద్యుత్ కార్యాలయంలో ఈ నెల 20న రాపూరు, సైదాపురం, గూడూరు, మనుబోలు, కోట, వాకాడు, చిట్టమూరు తదితర మండలాల విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రతిఒక్కరూ విద్యుత్ పొదుపును పాటించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు సోలార్ పంప్‌సెట్లను రాయితీపై ఏర్పాటు చేసుకునేందుకు తగు అవగాహన కల్పించాలన్నారు. 5 హెచ్‌పి మోటార్‌కు సోలార్ విద్యుత్‌ను అమర్చుకోవాలంటే సుమారు 5లక్షల దాకా ఖర్చువుతుందని, రైతు రూ.50వేలు చెల్లిస్తే రాయితీ పొంది ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన సూచించారు. జిల్లాలో త్వరలో ఎల్ఇడి బల్బులను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి బకాయిలు వసూళ్ళు చేయడంపై నిర్లక్ష్యం చూపిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ నాగశయనరావు, ఇస్మాయిల్, శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్, విజయకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# సందిగ్ధంలో పొదలకూరు వ్యాపారులు

నెల్లూరుజిల్లా పొదలకూరులోని వ్యాపారస్తులు సందిగ్ధంలో సతమతమవుతున్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సమీపిస్తుండడంతో సరుకులు దిగుమతి చేసుకోవాలో, వద్దో తెలియక దిక్కుతోచని స్థితిలో వున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్, పంచాయితీ బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగిస్తారనే ప్రచారం జరుగుతుండడంతో వ్యాపారస్తులు ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు ఇటీవల ఆక్రమణలకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను తహశీల్దార్ కృష్ణారావు ఆక్రమణదారులకు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లా కలెక్టర్ జానకి 20వ తేదీ సాయంత్రం రాపూరు నుంచి నెల్లూరు వెళుతూ మార్గమధ్యలో పొదలకూరు పట్టణ ఆక్రమణలను కారులో నుంచే పరిశీలించారు. తహశీల్దార్ కృష్ణారావు నుంచి పూర్తి వివరాలు సేకరించారు. అయితే న్యాయపరమైన చిక్కులు ఉన్నందున జిల్లా స్థాయి అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని సందేహాలు ఉన్నాయి.




# బిజెపిని బలోపేతం చేయాలి

జిల్లాలో బిజెపిని మరింత బలోపేతం చేయాలని, ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామగ్రామానా ప్రజలకు తెలియజెప్పి, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకుడు సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నియోజకవర్గ బిజెపి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని పటిష్టవంతం చేసేందుకు బిజెపి సభ్యత్వ నమోదును మరింతగా పెంచాలన్నారు. నియోజకవర్గంలో 20వేల సభ్యత్వం అధిగమించాలని కోరారు. దేశంలో సుస్థిరపాలన, సుపరిపాలనకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతగానో కృషి చేస్తున్న నేపథ్యంలో, ప్రతి కార్యకర్త నిరంతరం శ్రమించి పార్టీ బలోపేతానికి అలుపెరుగని కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2019 సంవత్సరానికల్లా జిల్లాలో బిజెపి ఒక బలమైన పార్టీగా ఏర్పడాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు అందరూ అవిరామంగా కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి పరంధామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గున్నం ప్రసాదరెడ్డి, రాజా సత్యనారాయణ, కందుకూరి వెంకటసత్యనారాయణ, కుదుముల సుధాకరరెడ్డి, రమణప్పనాయుడు, జి.భరత్‌కుమార్, మమతారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాలకృష్ణారెడ్డి, అంబటి శ్రీనివాసులురెడ్డి, ఎల్.రాజేశ్వరనాయుడు, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత విలువైన వ్యాపారసంస్థ శ్రీసిటీ






అత్యంత విలువైన వ్యాపారసంస్థగా శ్రీసిటీ మరో అరుదైన, ప్రతిష్టాత్మకమైన పురస్కారం అందుకుంది. ప్రపంచ సంప్రదింపుల పరిశోధనాసంస్థ వరల్డ్ కన్సల్టెంట్ రీసెర్చ్ కార్పొరేషన్, డబ్ల్యుయుసిఆర్‌పి యొక్క గుర్తింపు పొంది ఆ సంస్థ 2014 సంవత్సరానికి అలాంటి సంస్థలకు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని శ్రీసిటీ అందుకోవడం విశేషం.

ఇటీవల ముంబైలో పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ ఎం.డి రవి సన్నారెడ్డి ఈ పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార నగరంగా శ్రీసిటీ అంతర్జాతీయ ఖ్యాతి పొందుతోందని ఈ సందర్భంగా విడుదల చేసిన పుస్తకంలో పేర్కొన్నారు. మౌళిక వసతుల రంగంలో ఉన్నత ప్రమాణాలతో అత్యంత నిబద్ధతతో పరిశ్రమలకు అవసరమైన అంతర్జాతీయ స్థాయి మౌళిక వసతులు కల్పిస్తున్నందుకు శ్రీసిటీ మంచి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ పురస్కారం అందుకున్న అనంతరం శ్రీసిటీ ఎం.డి రవి సన్నారెడ్డి మాట్లాడుతూ, మౌళిక వసతుల రంగంలో దేశంలో అత్యంత విలువైన వ్యాపార సంస్థగా శ్రీసిటీ డబ్ల్యుయుసిఆర్‌సి గుర్తింపును పొందిందని అన్నారు. వ్యాపార రంగంలో మేటి సంస్థలను గుర్తించడంలో ఆసియా ఖండంలోనే ప్రథమస్థానంలో వున్న ప్రపంచ సంప్రదింపుల పరిశోధన సంస్థ ఈ పురస్కారాలను ప్రదానం చేసిందని ఆయన అన్నారు. శ్రీసిటీ స్థాపించిన అయిదేళ్ళలోనే ఈ పురస్కారాన్ని అందుకోవడం తనకెంతో సంతోషంగా వుందని, ఇది సంస్థ సాధించిన విజయమని ఆయన అన్నారు. ఈ గుర్తింపును పొందేందుకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.




# సిద్ధమైన ఆర్ & బి అతిథి గృహం

నెల్లూరు దర్గామిట్టలోని ఆర్ & బి అతిథిగృహం త్వరలోనే తిరిగి పునప్రారంభం కాబోతోంది. గత కొన్నేళ్ళుగా మరమ్మతులకు గురై ఆలనాపాలనా లేకుండా వున్న ఈ అతిథిగృహాన్ని కృష్ణపట్నంపోర్టు కంపెనీ వాళ్ళు మరమ్మతులు చేపట్టి మళ్ళీ కొత్త సొగసులు తీసుకొచ్చారు. అతిథిగృహంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నెల్లూరుకొచ్చే విఐపిలకు కేవలం పినాకిని అతిథిగృహం మాత్రమే అందుబాటులో వుంది. అయితే అక్కడ తగినన్ని సూట్‌లు లేకపోవడంతో ఒక్కోసారి ప్రైవేట్ హోటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది. ఆర్ & బి గెస్ట్‌హౌస్ ప్రారంభమైతే ఈ సమస్య తీరినట్లే!

# ఓవరాల్ ఛాంపియన్ నెల్లూరు



నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెఎన్‌ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో మూడురోజులుగా జరుగుతున్న 60వ అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిసాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో చేసిన బాలబాలికల యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అండర్-14 బాలుర విభాగంలో 538 పాయింట్లతో నెల్లూరు జట్టు మొదటిస్థానాన్ని కైవసం చేసుకోగా 523పాయింట్లతో విజయ నగరం జట్టు రెండవస్థానం దక్కించుకుంది. 486పాయింట్లతో కడపజట్టు మూడవ స్థానంలో నిలిచింది. అండర్ -17 బాలుర విభాగంలో 525పాయింట్లతో నెల్లూరుజట్టు మొదటిస్థానాన్ని దక్కించుకోగా 512పాయింట్లతో గుంటూరు జట్టు రెండవ స్థానాన్ని దక్కించుకుంది. 459పాయింట్లతో కృష్ణాజిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. అండర్-19 బాలుర విభాగంలో ఇతర జిల్లాల నుంచి ఎవరూ రాకపోగా నెల్లూరు జట్టును మొదటి స్థానానికి ఎంపిక చేశారు.

వ్యక్తిగత, బృంద విభాగాల్లో 13జిల్లాల నుంచి విచ్చేసిన యోగా క్రీడాకారులు చేసిన ప్రదర్శనలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నిర్ణయించారు. 188పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నెల్లూరుజట్టు దక్కించుకోగా, గుంటూరుజట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఆ తర్వాతి స్థానాన్ని విజయ నగరం జట్టు దక్కించుకుంది. విజేతలకు బహుమతి ప్రదానం గావించారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కెఎన్‌ఆర్ నగరపాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ ప్రకాశ్‌రావు, పిఇటి విజయకుమార్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి విక్టర్, యోగా గురువు నరశింహశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రభా'తం

ఈ 'జయ'నామ సంవత్సరం భారతీయ జనతాపార్టీకి అద్భుతంగా కలిసొచ్చింది. దేశంలో దశదిశలా కమలం జెండా రెపరెపలాడుతున్న ఏడాది ఇది. ప్రధాని నరేంద్రమోడీ మాటే ఒక మంత్రంగా మారుమ్రోగుతున్న కాలమిది. ఆ పార్టీకి ఆయన కార్యదీక్షే జయసూత్రంగా నిలచి అంతటా 'జయ'భేరి మోగిస్తున్న సమయమిది. తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలనే సాధించింది. దీంతో, ఈ 'జయ'లో..బిజెపికి మరో జయం చేకూరినట్లయింది.

ఇటీవల మహారాష్ట్ర, హర్యానాల్లో సత్తా చాటిన బిజెపి, తాజాగా ఝార్ఖండ్‌లోనూ జయపతాకం ఎగురవేసింది. కశ్మీర్‌లో కాస్త వెనుకబడినా, జమ్మూలో దుమ్ము రేపేసింది. ప్రధాని నరేంద్రమోడీ అభివృద్ధి మంత్రం అమోఘంగా పనిచేసి ఝార్ఖండ్‌లో కమలానికి కనీవినీ ఎరుగని విజయం సాధించిపెట్టింది. జమ్ముకాశ్మీర్‌లోనూ మెరుగైన ఫలితాలనే సాధించింది. ప్రధాని మోడీ రాజకీయ చాతుర్యానికి, దీక్షాదక్షతలకు.. ఆయన పట్ల ప్రజలకున్న విశ్వాసానికీ ఈ ఫలితాలు ఒక నిదర్శనమని చెప్పవచ్చు.

అసలే రాజకీయ అస్థిరతకు నిలయంగా వుంటూ, మరోవైపు విస్తరించిన తీవ్రవాదంతో కునారిల్లిపోతూ, ఎంతోకాలంగా ఎలాంటి ప్రగతికీ నోచుకోకుండా వెనుకబడివున్న ఆదివాసీ రాష్ట్రం ఝార్ఖండ్. సహజ సంపదకు ఇక్కడ లోటు లేనప్పటికీ, అవినీతి.. అభివృద్ధి నిరోధక మూకల విస్తరణతో ఆ రాష్ట్రం అతీగతీ లేకుండా అధోగతి పాలై వుంది. ఇంతగా సంక్షోభ సుడిగుండాల్లో పడి కొట్టుమిట్టాడుతోన్న ఝార్ఖండ్‌లో విజయం సాధించడమంటే మాటలు కాదు. అయితే, అంతటి అసాధ్యాన్నీ సుసాధ్యం చేసింది ప్రధాని అభివృద్ధి మంత్రమేనంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. 14 ఏళ్ళ క్రితం అవతరించిన ఈ రాష్ట్రంలో ఇప్పటిదాకా ఇంత స్పష్టమైన మెజార్టీ ఏ పార్టీకి రాలేదు కూడా. ఆ ఘనత ఇప్పుడు బిజెపికే దక్కింది. మొత్తం 81 స్థానాలున్న ఝార్ఖండ్‌లో ఏకంగా 37 స్థానాల్లో బిజెపి జయభేరి మోగించింది. కేవలం ప్రధాని మోడీ ప్రభంజనం వల్లనే ఇంతటి అఖండ విజయం లభించిందని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో ఇక్కడ 18 స్థానాలు సాధించిన బిజెపి, ఈసారి ఒక్కసారిగా రెట్టింపు స్థానాల్లో సత్తా చాటి విజయపతాకం ఎగురవేసింది. మొత్తం 81 స్థానాలున్న ఝార్ఖండ్‌లో ఏకంగా 37 స్థానాల్లో బిజెపి అద్భుత విజయం సాధించడం రాజకీయ విశ్లేషకులను సైతం విశేషంగా ఆకట్టుకుంటోంది. అధికార పీఠాన్ని చేరుకునేందుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 41 అయితే, మిత్రపక్షమైన ఎజెఎస్‌యు సాధించిన 5 స్థానాలతో కలిపి సునాయాసంగా ఆ సంఖ్యను బిజెపి అధిగమించింది. ఈ ఎన్నికల్లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, జేడీ (యు) ఎలాంటి పొత్తు లేకుండా ఎన్నికల బరిలోకి దిగాయి. జెఎంఎం 18 స్థానాల్లో విజయం సాధిస్తే, కాంగ్రెస్ మాత్రం పూర్తిగా నీరసపడిపోయి కేవలం 6 స్థానాలను మాత్రమే నిలబెట్టుకోగలిగింది.

అస్థిర ప్రభుత్వంతోనూ.. కుటుంబ రాజకీయాలతోనూ విసిగివేసారిపోయిన ఝార్ఖండ్ ప్రజలు ఈసారి ధీరోదాత్తంగా వ్యవహరించారు. అపరిమిత విశ్వాసంతో అభివృద్ధి పథగామి అయిన ప్రధాని మోడీ వెంట నడిచారు. ఖనిజ సంపద పుష్కలంగా వున్న ఝార్ఖండ్ ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా ఎలాంటి ప్రగతికీ నోచుకోకపోవడం అక్కడి ప్రజలను ఎన్నాళ్ళనుంచో కలవరపెడుతోంది. అందుకు అవినీతి, స్వార్ధ రాజకీయాలు, రాజకీయ అస్థిరతలే కారణమని బిజెపి విశ్లేషించి చెప్పింది. బిజెపికి స్పష్టమైన మెజార్టీని అందిస్తే, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తాము కట్టుబడివుంటామన్న ప్రధాని మోదీ ఇచ్చిన భరోసాపై ప్రజలకు ఎనలేని నమ్మకం ఏర్పడింది. అంతేకాక, దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, విదేశాంగ విధానాలు, ఆయన కార్యదక్షత అన్నీ ప్రజలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని మోదీ పట్ల ప్రజలకున్న ఆ అపార నమ్మకమే ఝార్ఖండ్‌లోనూ బిజెపి విజయకేతనం ఎగురవేసేందుకు దోహదం చేసిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఇకపోతే, జమ్ము కాశ్మీర్‌లో మాత్రం ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత రాలేదు. మొత్తం 87 స్థానాలున్న ఈ రాష్ట్రంలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) 28 స్థానాలు సాధించి ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. బిజెపి 25 స్థానాలతో ద్వితీయస్థానంలో నిలచింది. లడాఖ్, కాశ్మీర్ లోయలో బిజెపికి ఒక్క స్థానం కూడా దక్కనప్పటికీ, జమ్ములో మాత్రం బిజెపి దుమ్ము రేపింది. జమ్ములో మొత్తం 37 స్థానాలు వుండగా, 25 స్థానాల్లో బిజెపి విజయఢంకా మ్రోగించింది. మొన్న మొన్నటిదాకా కాశ్మీర్‌ను పాలించిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) పార్టీకి మాత్రం ఈ ఎన్నికల్లో ఘోరపరాజయం తప్పలేదు. ఈ పార్టీ కేవలం 15స్థానాలకే పరిమితమైంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇక్కడ కూడా చతికిల బడిపోయింది. కేవలం 12 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో, జమ్ము కాశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటులో కూడా బిజెపి కీలకపాత్ర పోషించనుంది. జమ్ము కాశ్మీర్‌లో 23 శాతం ఓట్లు సాధించడం, గతంలోకంటే మిన్నగా ఈసారి 25 స్థానాల్లో విజయకేతనం ఎగురవేయడం దేశవ్యాప్తంగా బిజెపి శ్రేణుల్లో ఎంతో ఉత్సాహం నింపుతోంది. ఇదిలావుంటే, జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల హెచ్చరికలను, వేర్పాటువాదుల ఎన్నికల బహిష్కరణ పిలుపులను సైతం ఖాతరు చేయకుండా కాశ్మీర్ ప్రజలు ఎన్నికల్లో ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం విశేషం. అస్తవ్యస్తత స్థానంలో అభివృద్ధి వుండాలని, అస్థిరత స్థానంలో సుస్థిరత నిలవాలనే ధ్యేయంతో ఆ రెండు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఉత్సాహంతో ఈసారి ఓటింగ్‌లో పాల్గొన్నారని భావించవచ్చు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ రెండు రాష్ట్రాల్లో 66 శాతం పోలింగ్ నమోదు కావడమే అందుకు నిదర్శనం. ఏదేమైనా.. దేశంలో సుస్థిర పాలన.. సుపరిపాలన లక్ష్యాలతో, దేశాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బిజెపికి ఈసారి ఎన్నికల ఫలితాలు ఎంతైనా ఆనందదాయకమే. పార్టీ శ్రేణులకు, నేతలకు, కమలనాధులకు, అన్నిటికంటే ముఖ్యంగా బిజెపి జాతీయ నేత అయిన అమిత్‌షాకీ ఈ ఫలితాలు అమితానందం కలిగించేవే. ఎందుకంటే, కాంగ్రెస్ రహిత భారత్‌ను ఏర్పాటుచేయాలనే బిజెపి లక్ష్యానికి చేరువగా, ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆ పార్టీని మరో ముందడుగు వేయించినట్లయింది. ఏదేమైతేనేం, ఈ 'జయ' నామ సంవత్సరం ఇలాంటి విజయాలెన్నిటినో తెచ్చి ఇచ్చిన.. శుభ నామ సంవత్సరం కావడం బిజెపికి ఎంతైనా ఆనందదాయకమే మరి!..

## 'జయ'భేరి



ఇటీవల మహారాష్ట్ర, హర్యానాల్లో సత్తా చాటిన బిజెపి, తాజాగా ఝార్ఖండ్‌లోనూ జయపతాకం ఎగురవేసింది. కశ్మీర్‌లో కాస్త వెనుకబడినా, జమ్మూలో దుమ్ము రేపేసింది. ప్రధాని నరేంద్రమోడీ అభివృద్ధి మంత్రం అమోఘంగా పనిచేసి ఝార్ఖండ్‌లో కమలానికి కనీవినీ ఎరుగని విజయం సాధించిపెట్టింది. జమ్ముకాశ్మీర్‌లోనూ మెరుగైన ఫలితాలనే సాధించింది. ప్రధాని మోడీ రాజకీయ చాతుర్యానికి, దీక్షాదక్షతలకు.. ఆయన పట్ల ప్రజలకున్న విశ్వాసానికీ ఈ ఫలితాలు ఒక నిదర్శనం.

# బ్యాంకు ఖాతా తప్పనిసరి...



జిల్లాలో ఇప్పటికీ బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలు ఉన్నట్లయితే సమీపంలోని బ్యాంకు శాఖను గాని బిజినెస్ కరస్పాండెంట్లను గాని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రధానమంత్రి జనధనయోజన పథకం గురించి తెలియజేస్తూ జిల్లాలోని బ్యాంకు శాఖలు మరియు ఇతర ప్రతినిధుల ద్వారా సర్వే చేసి ఖాతాలోని కుటుంబాల వివరాలు సేకరించి వారు ఖాతా తెరవాల్సిందిగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో దండోరా వేయించబడింది. జిల్లాలోని బ్యాంకుల నుంచి జిల్లా స్థాయి బ్యాంకర్ల సమితికి అందిన సమాచారం ప్రకారం జిల్లాలోని అన్ని గ్రామాలు మరియు మున్సిపల్ వార్డులలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక ప్రాథమిక పొదుపు ఖాతా ఉందని తెలిసిందన్నారు.

ఈ విషయంలో ఏమైనా సలహాలు గాని ఫిర్యాదులు గాని వున్నట్లయితే 15రోజుల్లోపు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వారి ఫోన్ నెం. 0861-2327321కు లేదా ఎ.పి.యస్.యల్.బి.సి కాల్ సెంటర్ / టోల్‌ఫ్రీ నెం. 1800 425 8525కు తెలియజేయవలసిందిగా ఆమె కోరారు.

# బ్యాంకులకు చేరిన నిధులు

నెల్లూరుజిల్లాలో రైతు రుణమాఫీ కింద 5,04,611మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటివిడతగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 1,84,955మంది మాఫీ అర్హత పొందారని లీడ్‌బ్యాంక్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు తెలిపారు.

సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ కింద మొదటి జాబితాలో లబ్దిదారులకు అందించే మొత్తం రూ.678.29కోట్లని తెలిపారు. రూ.206కోట్లు లబ్దిదారులకు అందించేందుకు బ్యాంకులకు అందిందని తెలిపారు. రెండోజాబితాలో 1,84,731 మంది ఉన్నారని, వీరికి సంబంధించి ఆధార్, రేషన్‌కార్డుల జెరాక్స్‌లను అందజేయాలని లేని పక్షంలో వారి కుటుంబసభ్యులైనా అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అనర్హత జాబితాలో 1,34,925మంది ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన 2007సంవత్సరం ఏప్రిల్ 1తేదీ నుంచి 2013 సంవత్సరం డిసెంబర్ 31వ తేదీ గడువుకు ముందు తర్వాత ఉన్నవారు దరఖాస్తు చేసుకున్నవారు, వ్యవసాయం కింద బంగారం తాకట్టు పెట్టుకుని పంట రుణాలు తీసుకుని రుణమాఫీ సమయంలో ఏ విధమైన సాగుభూమి వివరాలు తెలియజేయని వారి వివరాలు మూడవ జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఇటువంటి వారంతా తమ ఫిర్యాదులను మీసేవలో తెలియజేయాలన్నారు. రెండవ జాబితాలో ఉన్నవారిని మీసేవలో తీసుకోరన్నారు. రెండవ జాబితాకు సంబంధించిన వివరాలు ఇప్పటికే మండలాల వారీగా ఆయా తహశీల్దార్లకు వెళ్లాయని, ఫిర్యాదు చేసుకునే వారు గ్రామ జన్మభూమి కమిటీలకు తెలియజేయాలన్నారు.




## ఇకనైనా తీరు మారాలి!

ఏ పేరుతో పిలిచినా యావత్ జీవరాశికి దైవం ఒక్కటే అన్న విషయం ఎందరో మహనీయులు బోధించారు. దైవానికి మతం లేదు, మతంలో దేవుడు లేడు. మానవులంతా ఒక్కటేనని చాటిచెప్పాల్సిన తరుణమిది. దేశ సమగ్రత, సామరస్యతను కాపాడుతామని ప్రమాణం చేసిన కొందరు ఎంపీలు తీవ్రవాదులు మాదిరి రెచ్చిపోతున్నారు. ప్రజల మధ్య ద్వేషభావాలు పెంచే విధంగా ప్రకటనలు చేస్తున్నారు. ఆ తీరు మారాలి.

**– బి.పద్మజ, చెన్నై.**

## జగదీష్‌కి 'పద్మశ్రీ' ఇవ్వాలి

28.11.14సంచికలో 'లాయర్'లో డా॥ ఎ.జగదీష్ గారి గురించిన ఎన్నో విషయాలు తెలియజేశారు. సింహపురికే కాదు, రాష్ట్రానికి దేశానికి మణిమకుటం వారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మేధావి శ్రీ జగదీష్‌గారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 'పద్మశ్రీ' లాంటి గౌరవాలతో గౌరవించాలి. ఇలాంటి వారిని గురించి తెలిపినందుకు 'లాయర్'కు ధన్యవాదాలు.

**కాకుటూరి సుబ్రహ్మణ్యం, కావలి.**

## బాబూ ఒక మిడాసే

దేవుడు ప్రత్యక్షమై 'మిడాస్'ను ఏదైనా ఒక వరం కోరుకోమన్నాడు. 'తాకిందల్లా బంగారు కావాలి' అన్నాడు మిడాస్. వరం పొందిన మిడాస్ భార్య వడ్డించిన పంచభక్ష్య పరమాన్నాలు బంగారంగా మారిపోయాయి, వాటిని తాకగానే! అన్నమో రామచంద్రా అంటూ ఆకలితో అల్లాడాడు. ఆంధ్ర ప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చే సారవంతమైన భూముల స్థానంలో అంతర్జాతీయ స్థాయిలో రాజధాని నిర్మిస్తానన్న చంద్రబాబూ ఒక మిడాసే!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## మంజులను గుర్తించాలి

నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జీవితకాలం కాంగ్రెస్‌పార్టీని నమ్ముకున్నట్లే నువ్వుల మంజులమ్మ కూడా తెలుగుదేశంపార్టీని నమ్ముకుంది. పార్టీ కార్యక్రమాలకు పోతుంది. నిత్యం చంద్రబాబు స్మరణ చేస్తుంది. ఒకసారి రాపూరు టిక్కెట్ ఇస్తామని, ఇంకోసారి వెంకటగిరి టిక్కెట్ ఇస్తామని ఆశ చూపి ఎగ్గొట్టారు. ఎమ్మెల్సీ పోస్టు న్యాయంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఇవ్వాలి. నువ్వుల మంజులకు ఏదైనా నామినేటెడ్ పోస్టు ఇచ్చి న్యాయం చేయాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## కంటి నిండా నిద్రపోనివ్వండి

నెల్లూరు నగరాన్ని మహానగరంగా మారుస్తామంటున్నారు మన నాయకులు. ప్రజలను కంటినిండా నిద్దురపోనిస్తే చాలు. నగరమంతా చెత్తతో నిండిపోతోంది. కాస్త వర్షం పడితే చాలు రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. ఎటుచూసినా గుంతలు. దోమలు మనుషుల రక్తాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సమస్యను పరిష్కరిస్తే చాలు.

**ఎస్.వి.ఎస్.కోటేశ్వరరావు, నెల్లూరు.**

## సుందర నగరం సరే...

# పందుల మందలేంది...?



**నెల్లూరు నగరాన్ని సుందర నందన బృందావనం చేయాలని మేయర్ అబ్దుల్ అజీజ్ కలలు కంటున్నారు. ఇందుకోసం ఆయన చక్కటి స్కెచ్‌లు కూడా గీయించారు. నగరన్ని అందంగా తీర్చిదిద్దాలన్న ఆయన ప్రయత్నం అభినందించదగినదే! అందమైన ఇళ్లును కట్టాలంటే ముందు పునాదిని తీయాలి. అందమైన నగరాన్ని నిర్మించాలన్నా ముందు పునాది వుండాలి.**

ప్రతి సందులోనూ పందులు మందలు మందలుగా తిరుగుతూ, పాదచారుల మీద కుక్కలు దాడులు చేస్తూ, ఇళ్లల్లోకి కోతులు దూరి కిష్కింధకాండను చూపిస్తూ, పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు జనం రక్తాన్ని పీలుస్తుంటే, ఊరిచివర్ల అందమైన ఆర్చీలు ఏర్పాటు చేసుకుని ఇదే సుందర నగరం అంటే సరిపోతుందా? నెల్లూరులో ట్రంకురోడ్డును వంద అడుగులు విస్తరించడం అవసరమే. అలాగే జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న హైబ్రీడ్ దోమల నివారణ కూడా అంత కంటే అవసరం. అలాగే మనం నిద్రలేచి కళ్లు తెరిస్తే ఎదురుగా పందులు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. చెత్తదిబ్బలు పర్వతాల్లాగా పేరుకుపోయి ఉంటున్నాయి. కోతులు, కుక్కల బెడద సరేసరి. ముఖ్యంగా ఆదిత్యనగర్, మాగుంట లేఅవుట్, బి.వి. నగర్, బాలాజీనగర్, సంతపేట, నవాబుపేట వంటి అత్యంత జన రద్దీగల ప్రాంతాల్లో కూడా పందులు మందలు మందలుగా తిరుగుతున్నాయంటే నెల్లూరు నగరం ఎంత ముదనష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కోట్లాదిరూపాయల ఖర్చుతో కూడు కున్న పనులను చేపట్టే ఆర్థిక వసతులు ప్రస్తుతం నగరపాలక సంస్థ వద్ద లేవు. దోమల నివారణ, పందుల బెడద లేకుండా చేయడం, ప్రతి ప్రాంతంలోనూ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడం వంటి పనులు తక్కువ ఖర్చుతో కూడుకున్నవే! ముందుగా ఈ పనులు చేపట్టి నగరాన్ని కొంచెం నీట్‌గా ఉంచితే చాలు. ఆర్థిక వసతులునప్పుడు పెద్దపనులు చేపట్టవచ్చు. ఈ చిన్న పనులతోనే నగర ప్రజలకు ముందు ఉపశమనం కలుగుతుంది.

# అభివృద్ధి వైపు పడని అడుగు




***2004లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. వై.యస్. ముఖ్యమంత్రి అయ్యాడు. తొలి ఆరునెలల్లో పనితీరు చూస్తే సూపర్ సోనిక్ విమానం వేగాన్ని తలపించింది. ఆరోజు నిధులు ఎలా తేవాలి, ఎక్కడనుండి తేవాలని ఆయన ఆలోచించలేదు. భారీ ఎత్తున ప్రాజెక్టు లకు, పరిశ్రమలకు, పారిశ్రామికసెజ్‌లకు శంకుస్థాపనలు చేసుకుంటూపోయారు. దాంతో ప్రతిచోటా ఊపొచ్చింది. ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన చోట వ్యవసాయ భూముల ధరలు పెరిగాయి. పారిశ్రామికవాడలు నెలకొల్పే చోట తొండలు గుడ్లు పెట్టే భూములు సైతం కోట్లలోకి వెళ్లాయి. ఆర్థిక వ్యవస్థలో కదలిక వచ్చింది. ఒకదానితో ఇంకోదానికి లింకు కాబట్టి వ్యాపారాలూ పుంజుకున్నాయి. ఆరోజు వేగంతో పోలిస్తే ఈరోజు పరిపాలన చాలా నిదానంగా నడుస్తోంది.***

విభజన మూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం వుంది. ఇది కాదనలేని సత్యం. కాని ఋణమాఫీ, రాజధాని వంటి అంశాల మూలంగా ప్రభుత్వం ఇతర అభివృద్ధి కార్యక్రమాలను గాలికొదిలేసింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది. నెల్లూరుజిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి కూడా ఇంతవరకు ఒక్క రాయి పడలేదు. ఏ నియోజకవర్గంలో కూడా పనులు జరగడం లేదు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో ప్రతిపాదనలు అడిగే పరిస్థితి కూడా లేదు. ప్రతి నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగానే వుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి కార్యక్రమం అంతంత మాత్రంగా నడుస్తుంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య అధికంగా వుంది. గ్రామ పంచాయితీలు నిధులు లేక నీరసంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇరిగేషన్ పనులు చాలావరకు నిధులు లేక ఆగి వున్నాయి. నెల్లూరు, సంగం బ్యారేజీలు అసంపూర్తిగా ఉన్నాయి. పెన్నా డెల్టా ఆధునీకరణ పనులు కూడా నిధులు లేక నత్తనడకన సాగుతున్నాయి. ఇక జిల్లాలో వివిధ గ్రామాల రోడ్లేకాక ప్రధాన రహదారులు కూడా అధ్వాన్నంగా తయారైవున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వమొచ్చాక ఎక్కడా ఒక్క కిలోమీటరు రోడ్డును కూడా మంజూరుచేసిన దాఖలాలు లేవు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరు నెలల్లో మూడుసార్లు జిల్లాకు వచ్చాడు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రభుత్వ వైద్యకళాశాలను ప్రారంభించడం తప్ప జిల్లాకు ఆయన కొత్తగా ఇచ్చిందేమీ లేదు. జిల్లాకు సంబంధించిన మున్సిపల్ మంత్రి నారాయణ కూడా రాజధాని వ్యవహారాలలో బిజీగా ఉంటున్నాడు. జిల్లాలో అభివృద్ధి పనులకంటూ ఆయన ప్రత్యేకనిధులు తెచ్చిందేమీ లేదు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయినా ప్రగతిలో అంగుళం కూడా ముందుకు కదలకపోవడం శోచనీయం.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

- మూడురోజుల మొక్కుబడేనా?

# పక్షుల పండుగ ఫలితాలేవీ?

ప్రతి సంవత్సరం భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకుంటున్నట్లే మూడురోజుల పాటు 'పక్షుల పండుగ'ను కూడా జరుపుతున్నారు. జిల్లాలో పులికాట్ సరస్సు, నేలపట్టు చెరువు మూలంగా ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ సీజన్‌లో విదేశాల నుండి వివిధ జాతుల పక్షులు వలసవస్తుంటాయి. పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. ప్రతి సీజన్‌లోనూ పక్షులు రావడం, మనం పండుగ చేసుకోవడం బాగానేవుంది. పండుగరోజుల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వస్తుంటారు. ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి పోతుంటారు. కాని ఆచరణలో మాత్రం ఒక్క హామీ కూడా నెరవేరడం లేదు. వాస్తవంగా చెప్పుకోవాలంటే పర్యాటక ప్రగతికి సూళ్లూరుపేట ప్రాంతానికి మించింది రాష్ట్రంలోనే లేదు. ప్రభుత్వం దృష్టిపెడితే ఈ ప్రాంతాన్ని చాలాపెద్ద పర్యాటక కేంద్రంగా మార్చొచ్చు. మన పులికాట్ లాంటి సరస్సు సింగపూర్‌లోనో, మలేషియాలోనో వుంటే దీని ఆధారంగానే వాళ్లు కోట్ల రూపాయలు సంపాదిస్తారు. మన జిల్లాలోనే చాలామందికి పులికాట్ సరస్సు ఎంత అందంగా ఉంటుందనేది తెలియదు. పులికాట్‌లో పడవ విహారం, ఇరకం, వేనాడు వంటి దీవులకు పడవలలో చేరుకోవడం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. మన వాళ్లు టూరిజం పేరుతో థాయ్‌లాండ్ దేశానికి వెళ్లి బోటులో 'కోరల్ ఐలాండ్' అనే ప్రాంతానికి పోయి వేలకువేలు తగలేసి వస్తున్నారు. అంతేగాని ముంగిట్లో వున్న పులికాట్ గురించి వారికి తెలియదు. పర్యాటకశాఖ వాళ్లు పులికాట్ వద్ద బోటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం కల్పిస్తే సెలవు దినాలలో పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కాని పులికాట్‌కు తగిన ప్రచారాన్ని కల్పించడంలో పర్యాటకశాఖ విఫలమవుతుంది. నేలపట్టులో పక్షుల సందర్శన కూడా ఒక తంతుగా మారుతుంది. పర్యాటకశాఖ పరంగా ఇక్కడ మొక్కుబడిగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సూళ్లూరుపేట నుండి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పులికాట్ సరసు విస్తరించి ఎంతో అందంగా వుంటుంది. రోడ్డు మార్గాన ఇక్కడ పర్యాటకులను ఆకర్షించవచ్చు. ఇక సూళ్లూరుపేట ప్రాంతంకు ఆధ్యాత్మికంగానూ చారిత్రక నేపథ్యం ఉంది. ఎన్నో ప్రాచీన ఆలయాలున్నాయి. అలాగే పారిశ్రామికంగానూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. పర్యాటక పరంగా కూడా ప్రభుత్వం దృష్టి పెడితే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి.

## జిల్లా స్థాయి కరాటే పోటీల్లో

# బంగారు 'రత్నాలు'



నెల్లూరు నగరంలోని టౌన్ హాలులో ఆల్ ఇండియా సుమన్ యువసేన వారు ఆగస్టు 28న నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో అనేక మంది విద్యార్థులు పాల్గొనగా నెల్లూరులోని సరస్వతినగర్ డా॥ కిషోర్స్ రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ నుండి ఆరెంజ్‌బెల్ట్ విభాగంలో 6వ తరగతి విద్యార్థి జి.కుషల్‌భవానిరెడ్డి, ఎల్లో బెల్ట్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి జివియస్ చరిత్, 8వ తరగతి విద్యార్థి కె.సాయిశివలు పాల్గొనగా ఈ ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని స్కూలు డైరెక్టర్ డా॥ కృష్ణకిషోర్ తెలిపారు. వీరికి ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతులమీదుగా టౌన్‌హాలులో ఆదివారం బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.వి.డి.మనోజ్‌కుమార్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్ విద్యార్థులకు, వాళ్ళ తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్‌రత్నం జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు ఏ.ఓ.రియాంక, విద్యార్థులు, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

## పాస్‌పోర్టు సేవాకేంద్రానికి కృషి చేస్తా!

**- నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి**



జిల్లాలో పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటు చేసేందుకు తగు కృషి చేస్తామని నెల్లూరు ఎంపి మేకపాటి రాజ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 20న ఆయన విలేకరులతో మాట్లా డుతూ పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటుకు సంబంధించి గత అక్టోబర్ 7న కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌కు లేఖ పంపించినట్లు తెలిపారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి పాస్‌పోర్టు సేవా శిబిరాలను నెల్లూరులో తరచూ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తనకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సాయంతో త్వరలో శాశ్వత పాస్‌పోర్టు కేంద్రం సాధిస్తామని ఆయన అన్నారు. డిప్యూటీ పాస్‌పోర్ట్ అధికారులు మధుసూదన్, రాజశేఖర్, పాస్‌పోర్టు సేవాకేంద్రం సమన్వయకర్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 28న వెన్నెలకంటి శశాంక్‌కు బిదా రమణయ్య స్మారక సాహితీ అవార్డు



ఈ ఏడాది బీదా రమణయ్య స్మారక సాహితీ అవార్డు-2014ను ప్రముఖ సినీకవి వెన్నెలకంటి కుమారుడైన ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి శశాంక్‌కు ప్రదానం చేయనున్నట్లు స్థానిక కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ తెలియజేశారు. ఈ నెల 28వ తేది సాయంత్రం 6-05 గంటలకు టౌన్‌హాలు ఓపెన్ ఆడిటోరియంలో ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా, మధురగాయకుడు ఘంటసాల 92వ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ గాయనీ గాయకులచే స్వర నీరాజనం సమర్పిస్తామని, ఈ సంగీత విభావరిలో సుప్రసిద్ధ గాయకుడు కాకినాడ శివప్రసాద్, పాడుతా తీయగా సింగర్స్ సర్వేపల్లి శ్రేయ, భవ్యశ్రీ గీతిక (విజయవాడ), జి-సరిగమప ఫేమ్ సుగంధిని, మల్లాది అనూష తదితరులు పాల్గొని తమ గానామృతంతో శ్రోతలను అలరిస్తారని ఆయన పేర్కొన్నారు. సాహిత్యాభిమానులు, కళాభిమానులు, ప్రజలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చలిపంజా..

నిన్న మొన్నటి వరకు కూడా ఎండలు అదరగొట్టాయి. చిత్త, విశాఖ కార్తెలలో ఓ పది రోజులు వర్షాకాలం వచ్చిందనిపించింది. ఇప్పుడు చలి బాగా పెరిగింది. ఉష్ణో గ్రతలు బాగా తగ్గాయి. ఉదయం 7గంటలకు కూడా ఎండ సెగ తగలడం లేదు. నెల్లూరు నగరంలో జన సంచారం ఏడు గంటలపైనే మొదలవుతుంది. చలికాలంలో బ్యాక్టీరియా త్వరగా వ్యాపించే అవకాశముండడంతో జనాలు చలి తీవ్రంగా వున్న సమయంలో బయట తిరగడం మానేస్తున్నారు. ఎండాకాలంలో తెల్లారుజామున 5గంటల నుండే వాకింగ్ మొదలుపెట్టే వాకర్స్ ఇప్పుడు ఆలస్యంగా వాకింగ్ చేస్తున్నారు. ఈ నెలంతా కూడా చలి తీవ్రంగానే ఉండొచ్చు.

## అలరించిన సినీ సంగీత విభావరి



సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 20వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో సినీసంగీత విభావరి జరిగింది. ప్రముఖ గాయకులైన విష్ణుప్రియ(తణుకు), రసూల్(నందిగామ), నామాల శ్రీనివాసరావు(చిలకలూరిపేట), తస్లీం(గుంటూరు), ప్రియదర్శిని(మాచర్ల), చంద్రిక(ఒంగోలు), మనుబోలు ప్రభాకరరావు(నెల్లూరు) ఆలపించిన అలనాటి, నేటి సినీగీతాలు అందరిని అలరించాయి. చిన్నారి సుమేధ భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమానుల్లాఖాన్ మిమిక్రీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గీతామయి వృద్ధాశ్రమానికి సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులు రూ.20వేలు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా షేక్ అక్బర్‌బాషా, పెళ్ళూరు సుధాకర్‌రెడ్డి, పెరుమాళ్ళ పద్మజాయాదవ్, భవానీ నాగేంద్రప్రసాద్, తిరివీధి ప్రకాశరావు, పాలపర్తి సాయిప్రసాద్, గోమేధికం భారతి, వల్లకవి వేంకటసుబ్బారావు, సుధాకర్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వివేకా@65



స్టైల్ ఆఫ్ సింహపురిగా ప్రసిద్ధిగాంచిన మాజీఎమ్మెల్యే ఆనం వివేకా నందరెడ్డి డిసెంబర్ 23వ తేదీతో 64ఏళ్ళు నిండి 65వ సంవత్సరంలోకి అడుగుపెట్టాడు. 65లో కూడా 25లా కనిపించే వివేకా గ్లామర్ రహస్యం ఎప్పుడూ నవ్వుతూ ఉండడం, ఎక్కడబడితే అక్కడ కనిపించినవి తింటూ ఉండడమే. ఇక సెకండ్‌షో సినిమాలు, మరికొన్ని హాబీలు ఆయనను నిత్యనూతన యవ్వనుడిలా, నవమన్మథుడిలా ఉంచు తున్నాయని చెప్పుకోవచ్చు. తన బర్త్‌డే రోజు ఎవరికీ అందుబాటులో లేకుండా వెళ్లే వివేకా ఈ సంవత్సరం కూడా అలాగే చేశాడు.

## డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓగా ఈదూరు సుధాకర్



నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా వున్న డాక్టర్ ఈదూరు సుధాకర్‌ను గూడూరు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా ఎయిడ్స్ కుష్టు నివారణాధికారిగా వున్న డాక్టర్ రమాదేవిని నియమించారు. డాక్టర్ ఈదూరు సుధాకర్ 2013 డిసెంబర్‌లో బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటికే కొన్ని ఆరోపణల నేపథ్యంలో సీజ్ చేసి వున్న బ్లడ్‌బ్యాంకును తిరిగి దారిలో పెట్టారు. తన పదవీకాలంలో 200కు పైగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి 2వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించడమే కాకుండా ప్రాణాపాయ స్థితిలో వున్న 2680మందికి రక్తం అందించగలిగారు. బ్లడ్‌బ్యాంక్‌లో రక్తనిల్వలను పారదర్శకంగా నిర్వహించడమే కాక ఎల్లవేళలా అందుబాటులో ఉంచారు. ఈదూరు సుధాకర్ కృషితోనే నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఈ ఏడాది రక్త సేకరణలో, నిర్వహణలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది.

## ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా శివశంకర్

విక్రమసింహపురి యూనివర్శిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా కావలి పిజి సెంటర్‌లో డీన్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ అయిన ప్రొఫెసర్ శివశంకర్ నియమితులయ్యారు. 21వ తేదీ నియామక పత్రాన్ని యూనివర్శిటీలోని ఇన్‌ఛార్జి విసి వియన్నరావు నుండి అందుకున్నారు.. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రిజిస్ట్రార్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా మహమ్మద్ హుస్సేన్

నెల్లూరు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా చిత్తూరుజిల్లాకు చెందిన మహమ్మద్ హుసేన్‌ను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిషనర్ నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న హైదర్‌బాషా గత నెలలో కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు.

## జగనన్నకు దండిగా భగవంతుడి ఆశీస్సులు

**- నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్**



వైయస్సార్‌సిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంసిఎస్ కళ్యాణ మండపంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జగనన్నకు నగర ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. జగనన్నపై దుష్ప్రయత్నాలు చేస్తున్నవారి నుంచి కాపాడి నిండు నూరేళ్ళు ప్రజలతో ఉండేలా దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూప్‌కుమార్‌యాదవ్, మునీర్ సిద్దిక్, టి.రఘు రామిరెడ్డి, సిద్దు రమణారెడ్డి, ముదిరెడ్డి లక్ష్మిరెడ్డి, సింగంశెట్టి అశోక్, సగిలి జయరామిరెడ్డి, కాకుటూరు విజయభాస్కరరెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి

**డిసిసిబి ఛైర్మెన్ ధనుంజయరెడ్డి**

నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరంలో బ్యాంకు బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మెన్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబాల సంక్షేమానికి రుణాలను రెన్యూవల్ చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా సేవలను విస్తృతం చేస్తామన్నారు. సాధారణ డిపాజిటర్లకు 10.5శాతం, సీనియర్ సిటిజన్‌లకు 11.25శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, డైరెక్టర్లు, ఉపాధ్యక్షులు, సిఇఓ రమణారెడ్డి, డిజిఎంలు సరిత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు 2015సంవత్సరం క్యాలెండర్‌ను నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని బ్యాంకు ఆవరణలో డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. రైతులకు ఉపయోగపడేలా క్యాలెండర్‌ను రూపొందించిన సిబ్బందిని ఆయన అభినందించారు. నూతన సంవత్సరంలో రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఓ కె.వి.రమణారెడ్డి, డిజిఎంలు సరిత, ఉషారాణి, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వేదవ్యాసలో 'మ్యాథ్స్ మ్యానియా వర్క్‌షాప్'



ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకల సందర్భంగా నెల్లూరులో మాగుంట లే అవుట్‌లోని వేద వ్యాస స్కూలులో సోమవారం మ్యాథ్స్ మ్యానియా వర్క్‌షాపును నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులు జామెంట్రీ, ట్రిగనామెంట్రీ మొదలైన అంశాలకు సంబంధించి 450నమూనాలను ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనలో శ్రీనివాస రామానుజన్ రైలు బండి ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. ఈ కార్యక్రమం ద్వారా గణితశాస్త్రాన్ని సులువుగా అర్థం చేసుకోవడం, దానిపై ఆసక్తిని పెంచుకోవడం ఎలా అనే అంశాలను విద్యార్థులకు స్కూలు కరస్పాండెంట్ ఎ.పి.బాలాజీ వివరించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. డైరెక్టర్ ఎ.పి.వేదగిరి వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.



## స్వచ్ఛభారత్ చేయాల్సింది ఇక్కడే!

# నగరంలో... నరకానికి మోడల్

నెల్లూరు నగరాన్ని సింగపూర్ చేస్తాం, సిడ్నీ చేస్తాం, సుందర బృందావనం చేస్తామంటూ పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. నగరంలో ప్రజలు సింగపూర్‌లను, సిడ్నీలను కోరుకోవడం లేదు. ప్రశాంతంగా గాలి పీల్చుకుని బ్రతికే మార్గం చూపమంటున్నారు.

మనం నగరంలో ఉన్నాం, నాగరిక జీవనంలో ఉన్నాం... కాని నెల్లూరు నడిబొడ్డులో బార్యాస్ ప్రాంతంలో వున్న పంట కాలువ వద్ద పరిస్థితి చూస్తే మాత్రం మనం ఆధునికకాలంలో ఉన్నామా? లేక ఆదిమానవుని కాలంలో ఉన్నామా? అని అనుమానం రాక తప్పదు. ఎందుకంటే అక్కడ మనుషులు కాదు కదా ప్రాణం వుండే ఏ జీవరాశి కూడా నిలబడే పరిస్థితి కనిపించదు.

- **మాంసం వ్యర్థాలతో ప్రజల సహజీవనం**
- **రోగాలతో నిత్యపోరాటం**



నెల్లూరులోని బార్యాస్ ప్రాంతంలో చేపల మార్కెట్ మరియు జంతు వధశాలలున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ రెండింటిని కట్టించారు. చేపల మార్కెట్‌ను ఆధునిక డిజైన్‌తో కట్టించామని అప్పుడు ప్రచారం చేయడం, పలు మున్సిపాల్టీల అధికారులు ఈ చేపల మార్కెట్‌ను సందర్శించి వెళ్లడం జరిగింది. చేపల మార్కెట్ పక్కనే జంతువధశాల వుంది. ఇక్కడ పొట్టేళ్లు, మేకలు, కోళ్లతో పాటు ఇతర జంతువులను వధించి మాంసం అమ్ముతుంటారు. జంతువులు, పక్షుల వ్యర్థాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి ప్రజాజీవనానికి భంగం కలగని ప్రాంతంలో పడేయాలి. కబేళాలలో మాంసాన్ని, వ్యర్థాలను శుద్ధి చేయడానికి యంత్రాలను, నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ఉండాలి. కాని ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో నగరపాలక సంస్థ వాటిని ఏర్పాటు చేయలేదు. మొక్కుబడిగా జంతువధశాలను కట్టి ఇచ్చేసారు. జంతువధశాలలో కొట్లు నిర్వహిస్తున్న వాళ్లు జంతువులు, పక్షులను కోయడం, వాటి వ్యర్థాలను గుట్టగా పక్కనే ఉన్న పంటకాలువలో వేయడం చేస్తున్నారు. దీంతో కాలువ పేగులు, ఎముకలు, జంతువుల కళేబరాలతో నిండిపోతుంది. నీళ్లు కూడా రక్తంతో ఎరుపెక్కుతున్నాయి. చేపల మార్కెట్‌లోని చేపల వ్యర్థాలను కూడా ఈ కాలువలోకే వదిలేస్తున్నారు. ఈ వ్యర్థాలు నీటిలోనే కుళ్లిపోయి విషమయంగా మారుతున్నాయి. ప్రమాదకరమైన బ్యాక్టీరియా విస్తరిస్తుంది. మూలాపేట, పెద్దబజారు వంటి ప్రాంతాలలో నివాసముంటున్న వాళ్లు ఈ కంపును భరించ లేకపోతున్నారు. ఎక్కడ రోగాలు వస్తాయోనని భయపడి ఛస్తున్నారు.

మురుగు కాలువలు, రోడ్ల పక్కన జంతువ్యర్థాలను పడేస్తుండడంతో 2003లోనే కొందరు సుప్రీంకోర్టులో దీనిపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇటీవలే సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ తుది విచారణ కొచ్చింది. రాష్ట్రంలోని 65మున్సిపాల్టీలలోని జంతువధశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వాటిపై తుది నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిని సుప్రీం కోర్టు ఆదేశించడంతో ప్రభుత్వం 65మున్సిపాల్టీలకు జంతువధశాలలను మూసేయండంటూ నోటీసులు జారీ చేసింది.

# ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించాలి

**గుంటూరు రేంజ్ ఐజి సునీల్‌కుమార్**



ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరిస్తేనే ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయడం సాధ్యమవుతుందని గుంటూరు రేంజ్ ఐజి పి.వి సునీల్‌కుమార్ అన్నారు. ఈ నెల 20న జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అటవీశాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ, జైళ్లశాఖల అధికారులు హాజరైన ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిస్థాయిలో అరికట్టి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి గుంటూరు సర్కిల్ అటవీశాఖ ఉన్నతాధికారి పి.వి చలపతిరావు, 5వ అదనపు జిల్లా జడ్జి టి.ఆనంద్, కడప రేంజ్ జైళ్ళశాఖ డిఐజి జి.జయవర్ధన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రెడ్డి గంగాధరరెడ్డి, అటవీశాఖ డిప్యూటి చీఫ్ కన్జర్వేటర్ జయచంద్రారెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.రామకృష్ణలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.




డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై తొమ్మిదేళ్ళు గడుస్తాయి.


మరపురాని మీ మధురస్మృతులతో...

తండ్రి : చిట్టమూరు పద్మనాభరెడ్డి
మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా పరిషత్, నెల్లూరు.
తల్లి : చిట్టమూరు అనసూయమ్మ
భార్య : డాక్టర్ చిట్టమూరు భారతి
కుమారుడు : చిట్టమూరు లోహిత్
కుమార్తె : చిట్టమూరు ప్రణీత
చెల్లెలు : నిర్మల
బావ : డా॥ సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేయాలి

### చైర్‌పర్సన్ పొనకా దేవసేన



కలెక్టర్ జానకితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందేగాని వారికి స్థలాలు చూపలేదని, అర్హులైన వృద్ధులకు పింఛను రావడం లేదని, గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జానకిని గూడూరు మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన, కౌన్సిలర్లు కోరారు. ఆమేరకు వారు వినతిపత్రం అందించారు. వీటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జడ్పీ ఉన్నత పాఠశాలకు

## వైజేపీ లయన్స్‌క్లబ్ ప్రొజెక్టర్



స్కూల్‌దిన్నెను ఏర్పాటు చేసిన వైజేపీ లయన్స్

గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు 20వ తేదీ వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రొజెక్టర్‌ను అందజేశారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు దాత సుబ్రహ్మణ్యం సహకారంతో దీన్ని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ అమృతవల్లి చేతులమీదుగా పంపిణీ చేశారు. ముందుగా గూడూరు పట్టణంలోని దళితవాడలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు స్కూల్ దిన్నెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైజేపీ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృతవల్లి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తమ క్లబ్ ఎల్లప్పుడూ సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మంజులాదేవి, ఆర్.వి.రావు, గురునాథం, మురళీనాయుడు, ఎస్.ఎల్.ఎన్.స్వామి, ఎస్ఎల్ఎన్ బాబు, నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ వైద్యశాలలో..

## రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైకాపా నాయకులు

గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు 21వ తేదీ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.యస్.జగన్ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వాటంబేటి శివకుమార్, ప్రవీణ్‌కుమార్, ఇస్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల పనితీరు పరిశీలన

గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికుల పనితీరును 20వ తేదీ మున్సిపల్ కమిషనర్ ప్రమీల పరిశీలించారు. పలు ప్రాంతాల్లో రోడ్లు శుభ్రపరుస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ కార్మిక సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వివేకానందరోడ్డు వద్దనున్న వాటర్ ట్యాంకులో మంచినీటికి సంబంధించిన దస్త్రాలను పరిశీలించి జాగ్రత్తగా రాయాలని తెలిపారు. అదేవిధంగా సీవీసీ పార్కు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో తిరిగి పరిశీలించారు.

## అలఘునాథస్వామి ఆలయంలో

## శ్రీరామ మహాయజ్ఞం



గూడూరు పట్టణంలోని అలఘునాథ స్వామి ఆలయంలో 21వ తేదీ విశ్వ హిందూ పరిషత్ స్వర్ణజయంతి ఉత్సవాల్లో భాగంగా విరాట్ హిందూ సమ్మేళనం, శ్రీరామమహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ ప్రముఖ్ ఓవేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడి, గోహత్యలు జరుగుతున్నాయన్నారు. హిందువులు, హిందూ సమాజం, జాగృతి వహించి అనతికాలంలోనే పరిష్కారమార్గం కనుగొనాలని సూచించారు. విహెచ్‌పి అఖిల భారత సహకార్యదర్శి సత్యం, ప్రాంతీయ సంఘటనా కార్యదర్శి కన్నా భాస్కర్, ఆర్ఎస్ఎస్ నాయుడు శేషు మాట్లాడుతూ సమాజంలో సామరస్యాన్ని నిర్మాణం చేయాలని, తద్వారా అందరికీ దేవాలయ ప్రవేశం, శ్మశాన అనుమతి, మంచినీరు అందేటట్లు చేయాలని కోరారు. అంటరానితనాన్ని రూపుమాపాలన్నారు. అనంతరం భజనలు, శ్రీరామమహాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు అధికసంఖ్యలో ఈ యజ్ఞంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు ఎమ్.మురళీరెడ్డి, మధుసూధన రావు, మురళీనాయుడు, రుద్రమరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి

## మరింతగా కృషి

**- మునిసిపల్ చైర్‌పర్సన్ డి.శారద**

ప్రజలందరినీ చల్లగా కాపాడే తల్లి పోలేరమ్మ అని, పోలేరమ్మతల్లి ఆలయ కార్యక్రమాలకు దాతలు చేస్తున్న సహకారం మరువలేనిదని, పోలేరమ్మ ఆలయం అభివృద్ధి కోసం అందరం కలిసి మరింత కృషిచేయాలని వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద అన్నారు. పోలేరమ్మ ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ కె. కుమార్, ఇ.ఓ రామచంద్రయ్య, మునిసిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ బీరం రాజేశ్వరరావు, కౌన్సిలర్లు రమేష్, మంచుబాబు, టిడిపి నాయకులు జి.వెంకటముని తదితరులు పాల్గొని, పోలేరమ్మ అమ్మవారి విశిష్టతను వివరించారు. వెంకటగిరి ప్రజ ఇలవేల్పు పోలేరమ్మతల్లి అని వారు పేర్కొన్నారు. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో పోలేరమ్మను పూజించుకుంటూ, మొక్కులు చెల్లించుకుంటూ వుంటారన్నారు. పోలేరమ్మ అమ్మవారి ఆలయం రాబడి కూడా ప్రతిఏటా పెరుగుతూనే వుందన్నారు. పోలేరమ్మతల్లి ఆలయానికి దాతల సహకారం ఎల్లవేళలా వుంటోందన్నారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ మాట్లాడుతూ, పోలేరమ్మ జాతరకు రాష్ట్రస్థాయిలో మంచి ప్రసిద్ధి వుందని, ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## ముక్కోటి ఏకాదశికి లఘుదర్శనమే

### వి.ఐ.పి. బ్రేక్ దర్శనం రద్దు : ఇ.ఓ. రామిరెడ్డి



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నూతన సంవత్సరాది (జనవరి 1వ) తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రతి వి.ఐ.పి.కి కంచుగడప దగ్గర నుంచి లఘు దర్శనం కల్పిస్తున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి తెలిపారు. ఆయన ఆలయ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వి.ఐ.పి.ల బ్రేక్ దర్శనం రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ముక్కోటి ఏకాదశి, నూతన సంవత్సరాది సందర్భంగా ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేకంగా అలంకరిస్తారన్నారు. క్యూలైన్లు పటిష్ఠంగా చేసి భక్తులకు త్రాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ఆలయంలో రోజూ నిర్వహించే నిత్యాన్నదానం వెయ్యి మందికే కాకుండా అదనంగా సిద్ధం చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డిఎస్పీతో చర్చలు జరిపి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోజు వరదరాజస్వామి ఆలయంలో కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లోబావి ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థానికి గదులు నిర్మించుటకు దాతలు ముందుకొచ్చారన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఏఇఓ శ్రీనివాసులురెడ్డి, పిఆర్ఓ హరిబాబు యాదవ్, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా సిమెంట్ రోడ్లు

- **పట్టించుకోని అధికారులు**

దక్షిణకైలాసం వాయులింగ క్షేత్రంగా కీర్తింపబడుతున్న శ్రీకాళహస్తి పట్టణంలో మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు కూడా తీర్చకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు, ఇక్కడికి వచ్చే భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు మినహా మిగతా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వాన్నంగా ఉంటున్నాయి. మున్సిపాల్టీకి ఆదాయాలు పెరుగుతున్నా, నిధులు వస్తున్నా కనీస సౌకర్యమైన రోడ్లు కూడా ఏర్పాటు చేయని పరిస్థితి. గతంలో ఎప్పుడో వేసిన రోడ్లు తాజాగా గుంతలమయంగా మారి మారుమూల గ్రామీణ ప్రాంతాలను తలపిస్తున్నాయి. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధిలో సిమెంట్‌రోడ్లు మరీ దారుణంగా ఉంటున్నాయి. ఇక్కడ పరిసర ప్రాంతాల్లో మూడు సినిమా థియేటర్లు, కూరగాయల మార్కెట్, మిల్క్‌సొసైటీ కార్యాలయం, ఈ సేవా కేంద్రం ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటాయి. అయితే సిమెంట్ రోడ్లుమాత్రం గుంతలమయంగా, అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. అడపాదడపా పట్టణంలోని ప్రధాన వీధుల్లో వేసిన రోడ్లపైనే తిరిగి రోడ్లు వేస్తున్న అధికారులు, మిగతా ప్రాంతాల గురించి పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రజలు కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టణంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలి.

## పేదలను గుల్లచేస్తున్న ప్రయివేటు క్లీనిక్‌లు

పట్టణంలోని ప్రయివేటు క్లీనిక్‌లు పేదలను గుల్ల చేస్తున్నాయి. రోగం వచ్చి ఆస్పత్రికి వెళ్లితే చాలు వందలు, వేల రూపాయలు చెల్లించుకోవాల్సి దుస్థితి ఏర్పడుతోంది. చేసిన టెస్టులే మరలా మరలా చేయిస్తూ అరచేతిలో వైకుంఠాన్ని చూపుతున్నారని పలువురు రోగులు ఆవేదన చెందుతున్నారు. అలాగని డబ్బులు ఖర్చుచేసినా రోగం నయం కాక రోగులు మరలా వేరే ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. సాధారణ జ్వరమైనా వందలు, వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న వందపడకల ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది నిలువెత్తు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో రోగులు ప్రయివేటు క్లీనిక్‌లను ఆశ్రయించక తప్పడం లేదు. ఇదే అదనుగా ప్రయివేటు క్లీనిక్‌ల డాక్టర్లు చిన్నపాటి రోగానికి కూడా టెస్టులు మీద టెస్టులుచేసి, రాసిన మందులే రాసి రోగులను గుల్ల చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

**మందులపై అధిక రేట్లు...**

ప్రయివేటు క్లీనిక్‌లలో మందులు కొనాలంటే సామాన్య ప్రజలు భయపడుతున్నారు. ఎంఆర్‌పి రేటుకన్నా అధిక రేట్లుకు మాత్రలు, మందులు విక్రయిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయాన్ని గుర్తించని పలువురు రోగులు మెడికల్ షాపు యజమాని చెప్పిన రేటును చెల్లించి మందులు తీసుకెళ్లడం జరుగుతోంది. ఒకరిద్దరు ఎంఆర్‌పి రేటును తెలుసుకుని సంబంధిత మెడికల్ షాపు యజమానిని ప్రశ్నించగా ఇష్టం ఉంటే కొనుగోలు చేయి.. లేదంటే వేరేషాపులో కొనుక్కోపో.. అంటూ నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు. ఈవిషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియక రోగులు నానా తంటాలు పడుతూ అడిగిన డబ్బులు చెల్లించి చేతులు దులుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్న మెడిసిన్స్‌ను ఎంఆర్‌పి రేట్లకే విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తిపరమైన ఆటంకాలు తొలగడం, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగడం, ఆదాయవృద్ధి బాగుండటం జరుగుతుంది. చేపట్టిన పనులు బాగా సాగుతున్నా ఎక్కువ టెన్షన్ పడుతుంటారు. అనవసర విషయాలలో తలదూర్చకండి. ముఖ్యవిషయాలపై నిర్ణయాలు చేయడానికి సందేహపడుతుంటారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు రావడం ప్రారంభమవుతుంది.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కొరకు కృషి చేస్తారు. అనుకున్న పనులకు చిన్న ఆటంకాలు కలిగి టెన్షన్ పడుతుంటారు. పెట్టుబడుల రంగాలలో అవకాశాలు లభించగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు. ఉద్యోగ బాధ్యతలను మంచి సామర్థ్యంతో నిర్వహిస్తారు.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ప్రణాళికలు పథకాలతో వ్యాపార పరిశ్రమ రంగాలను వృద్ధి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. శుభకార్య ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. ఉద్యోగ బాధ్యతలలో సామర్థ్యము, స్థానమార్పులుంటాయి. ముఖ్య విషయాలలో పెద్దల సలహాలను స్వీకరిస్తే మేలు.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయం ఆశించినంత ఉండదు. ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. చిన్న వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపార పథకాలతో జనులను ఆకర్షిస్తారు. ఆలోచనలు ఎక్కువగా ఉండి ఆచరణ తక్కువగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. విద్యాప్రగతి బాగుంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 26.12.2014 నుండి
తేది. 01.01.2015 వరకు

ఈ వారము మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవిబుధ శుక్రులు, మకరంలో 29వ తేదీ నుండి శుక్రుడు, 1 తేది నుండి బుధుడు, మకరంలో కుజుడు, కుంభమీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
2015 జనవరి 1తేదీ ఆంగ్ల సంవత్సరాది మరియు ముక్కోటి ఏకాదశి.
ముహూర్తములు లేవు.

**పుష్య మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | పంచమి | రాగం.9.40ని॥ |
| తేది. 27 | శని | షష్ఠి | రాగం.7.12ని॥ |
| తేది. 28 | ఆది | సప్తమి | సాగం.5.00ని॥ |
| తేది. 29 | సోమ | అష్టమి | సాగం.2.16ని॥ |
| తేది. 30 | మంగళ | నవమి | పగం.1.00ని॥ |
| తేది. 31 | బుధ | దశమి | పగం.11.20ని॥ |
| తేది. 01 | గురు | ఏకాదశి | ఉగం.10.00ని॥ |

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ వ్యవహారాలలో అనుకూలత తక్కువగా ఉంటుంది. స్వయంగా వ్యవహారాలను చూసుకోండి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది. మిమ్మల్ని విమర్శించేవారు పెరుగుతారు. స్థిరాస్తుల లావాదేవీలు ప్రక్కన పెట్టండి. పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయి. షేర్ మార్కెట్ ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనుకోని ఆదాయం లభిస్తుంది.

## మిథునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పెద్దమొత్తాలలో పెట్టుబడులు గాని, భాగస్వామ్య వ్యాపారాలు గాని చేయవద్దు. కొద్దిగా ఆర్థిక సమస్య లుండి, అభివృద్ధి అవకాశాలు మందగిస్తాయి. ఆదాయం తగ్గుతుంది. గృహ వస్తువాహన రిపేర్లుంటాయి. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. అనుకోని దూరప్రయాణా లుంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరకగలవు. సంప్రదింపులు, అగ్రిమెంట్ వ్యవహారాలలో జాగ్రత్త.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి పరంగా సామాన్య ఆదాయం ఉంటుంది. వ్యాపార వర్గాలు ఆటంకాలను అధిగమించుతారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు, స్థిరాస్తుల లావాదేవీలు కొత్త మలుపు తిరుగగలవు. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. ఆరోగ్యం బాగుం టుంది. ఉద్యోగ యత్నాలలో అనుకూలత బాగుం టుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారంలో ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి. వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. సమస్యలను అధిగమించే కృషి బాగా చేస్తారు. కుటుంబసభ్యులతో స్వల్ప భేదాభిప్రాయాలుండ వచ్చును. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక పరమైన ఇబ్బందులుంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండకపోగా ఆదాయం తగ్గుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆస్తి వ్యవహా రాలలోను, ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త పడండి. కుటుంబసభ్యులతో అనుకూలత సరిగా ఉండదు. అను కున్న పనులు తొందర తొందరగా పూర్తి చేయగలరు. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపార రంగాలలో ఆదాయం సామాన్యము. ఖర్చులు పెరగకుండా చూచుకొనాలి. వ్యాపార అవకా శాలు సరైనవి లభించవు. అవసరాలకు ఋణం చేయ వలసి రావచ్చు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. వ్యవసాయ, పారిశ్రామిక యజమాను లకు పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు ప్రస్తుతం చేయవద్దు.

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పట్టుదలతో చేపట్టిన పనులను జరుపుతారు. అవసరాలకు రావలసిన డబ్బులందుతాయి. వ్యవసాయ, పారిశ్రామికవర్గాలు కొత్త పథకాలతో అభివృద్ధి చెందుతారు. వ్యాపారాలలో మంచి అవకాశాలు, రాబడి ఉంటుంది. ఉద్యోగార్ధులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూల పరిస్థితులుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తివ్యాపారాలు లాభసాటిగా ఉండి అభివృద్ధి బాగుంటుంది. నూతన పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. బంధుమిత్రుల సహకారంతో ముఖ్యపనులు పూర్తి చేస్తారు. కొత్త కాంట్రాక్టులు లభించడం, ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల మీద కొంత ఆదాయం లభిస్తుంది.

---

# జగన్ విమర్శలు అర్థరహితం
### కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజం

జగన్ అధికారదాహంతో వున్నారని, ఆయనకు సిఎం కుర్చీ తప్ప మరేమీ కని పించడం లేదని, సిఎంపై జగన్ చేస్తున్న విమర్శలన్నీ అర్థరహితమని, ప్రజలంతా ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరును ప్రశంసిస్తూ జేజేలు పలుకుతుంటే జగన్ మాత్రం లేనిపోని విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని తెలుగుదేశం నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు.


తుఫాన్ ధాటికి ఉత్తరాంధ్ర ప్రజలు విలవిలలాడుతున్న సమయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు ఆ ప్రాంతానికి వెళ్ళి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అక్కడి ప్రజల కష్టాలను తీర్చారని, చంద్రబాబు సేవలను విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలే కాక, రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రజలు ప్రశంసిస్తుంటే జగన్‌కు మాత్రం అవేమీ కనిపించడంలేదని ఆయన విమర్శించారు. జగన్ మరో పది జన్మలెత్తినా సిఎం కాలే రని, ఆర్థికనేరాల కేసుల్లో జగన్ జైలుకు వెళ్ళడం తథ్యమని, కాగా, ముఖ్యమంత్రిపై, రాష్ట్ర మంత్రి డా.పి.నారాయణపై నెల్లూరు ఎమ్మెల్యే, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధరరెడ్డిలు తమ స్థాయిని మరిచి వారిపై విమర్శలు చేయడం దారుణమని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, నగర ప్రధానకార్యదర్శి వైవి సుబ్బారావు, కార్పొ రేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, బాలాజీ, వెంకయ్య, బ్రహ్మనాయుడు, చంద్ర, జాఫర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

---

**పుస్తక సమీక్ష**

# కవితా ప్రౌఢిమకు ప్రతీక.. 'షాణ్మాతురస్తవము'




రచన :
**అగస్త్యరెడ్డి వెంకురెడ్డి**
16-2-320, వేదంవారి అగ్రహారం, 2వ వీధి, విజయమహల్‌రోడ్, నెల్లూరు.

సమీక్షకులు :
**మెట్టు రామచంద్రప్రసాద్**
నెల్లూరు. ఫోన్: 93463 23609

ఈ కవి శ్రీ అగస్త్యరెడ్డి వెంకురెడ్డిగారు తన చిన్న తనంలోనే బి.ఏ 1959వ సంవత్సరంలో చదివేప్పుడే ఈ ప్రౌఢ శతకం రచించాడు. నెల రోజులలో మూడు వందలకు పైగా వ్రాయగలిగాడు. ఈ కవికి వ్రాయడం తెలుసు గానీ, ప్రచారం చేత గాదు. ఆ పద్యాలన్నీ శిథిలమైపోతే, అందులో మిగిలినవాటిని భద్రపరచి 53 సంవత్సరాల తర్వాత బంధుమిత్రుల ప్రోత్సాహంతో 'షాణ్మాతురస్తవము'గా 122 పద్యాలతో ముద్రించ గలిగాడు.

సమాజానికి ప్రతిబింబం సాహిత్యం. కవి అమలిన భావ ప్రకటనకు ప్రసిద్ధి శతక ప్రక్రియ. ఈ శతకంలో మకుటం 'షాణ్మాతురా'. ఇది చిన్నతనంలో వ్రాయబడినా మంచి ప్రౌఢిమను సంతరించుకున్నది. కవి చిరునామా తెల్పకపోతే ఎవరైనా దీనిని చాలా ప్రాచీన కావ్యంగా భావిస్తారు. ముఖ్యంగా మొదటి 12 సంబోధనా పద్యాలు చూడండి చాలు. కవిత ప్రౌఢిమ ఎట్టిదో తెలుస్తుంది. అందుకు మొదటి పద్యమే చూడండి.

***శ్రీ మత్పద్మభవేంద్ర ముఖ్యసుమనస్సేవ్యాంఘ్రినాళీక, దు***
***ష్షామధ్వాంతదివాకరా, శ్రితవిపత్సంహార, యుధ్యద్రిపు***
***స్తోమారణ్యదవానలా, భవరుజాదుఃఖాబ్ధి సంతారకా***
***సామజస్య మొసంగ బ్రోవుము నమస్కారంబు షాణ్మాతురా!..***

(తాత్పర్యం : బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలచే సేవ్యమైన పాదపద్మములు గలవాడా, దుష్షామమనెడి చీకటికి సూర్యుని వంటివాడా, ఆశ్రితుల విపత్తులను తొలగించువాడా, శత్రుసమూహమనెడి అరణ్యమునకు కార్చిచ్చు వంటివాడా, పుట్టుక వలన సక్రమించు రోగములనెడి దుఃఖ సముద్రమును తరింపజేయువాడా, కుమారస్వామీ నమస్కారము. మమ్ము దయతో బ్రోవుము). ఈ పద్యం ప్రబంధకవుల శైలికి ఏమాత్రం తీసిపోదు. ఈ కవి పద్యరచనలో బాగా చేయి తిరిగిన వాడు. సుబ్రహ్మణ్యస్వామి చరిత్ర పూర్తిగా తెలిసినవారికి తప్ప ఈ సంబోధనలు ఇతరులకు అర్థం కావు.

పద్యాలన్నీ శార్దూల మత్తేభాలు. ఈ శతకం అర్థం చేసుకోడానికి వీలుగా శ్రీ మోపూరు వేణుగోపాలయ్యగారి టీకా తాత్పర్యార్థాలు చాలా అవసరం. కవి తన ఆవేదనను కవిత నివేదనగా సమర్పించాడు. సంపూర్ణ శరణాగతిని వెల్లడించాడు. పద్య నిర్మాణ నైపుణ్యం ప్రశంసార్హం. సుబ్రహ్మణ్యస్వామి ఓంకారములోని అర్థాన్ని బ్రహ్మకు, అగస్త్యమహర్షికి బోధించాడు. తారకుని సంహరించాడు. శ్రీవల్లిని, దేవసేనను పరిణయ మాడాడు. ఇంకా షణ్ముఖుడు 'దుష్షామధ్వాంత దివా కరుడు', 'శ్రితవిపత్సంహారుడు', 'ఉద్యద్రిపుస్తోమారణ్య దవానలుడు', 'భవరుజా దుఃఖాబ్ధి సంతారకుడు'... ఆర్తితో, ఆరోగ్యాన్ని ప్రసాదింపుమని కోరుతూ శతకం ప్రారంభమైనా, 'దీని చేకొనుము, మోక్షం బిమ్ము', అంటూ మోక్షంపై కోరికతో శతకం ముగిస్తాడు ఈ కవి.

అగస్త్యరెడ్డిగారు రచనకు ముందు కావించిన సరస్వతీ ప్రార్థన చూడండి. ఆణిముత్యంలా వుంది.

***వాణి శుకవాణి మత్తబంభరసు వేణి***
***హంసకంఠాణి కల్యాణి అజుని రాణి***
***నన్ను సర్వగీర్వాణి వీణాసుపాణి***
***నిత్యమును నాదు జిహ్వపై నిలుచుగాత!..***

**చివరిమాట..** సాహిత్యాభిలాష వున్న ప్రతిఒక్కరూ చదువదగినది ఈ షాణ్మాతురస్తవము. ఏకధాటిన, ఒక్క బిగిన చదివించిందీ శతకం. ఇంతకన్నా కావ్య ప్రయోజనం ఏముంటుంది?...

ప్రతులకు : **బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి**
301, సాహితీ రెసిడెన్సీ, రైల్వేగేట్ రోడ్, త్యాగరాజనగర్, వేదాయపాలెం, నెల్లూరు. ఫోన్: 9441938272

---

# సిసియస్ ఇన్‌స్పెక్టర్‌గా రాజశేఖరరెడ్డి

నెల్లూరు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా యస్.వి. రాజశేఖరరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు గుంటూరు రేంజి కార్యాలయం నుంచి ఉత్త ర్వులు అందాయి. అయిదవ నగర సిఐగా పనిచేసిన రాజశేఖరరెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో కలిగిరి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. మరల సిసిఎస్ ఇన్‌స్పెక్టర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

---

# ఎమ్మార్పీఎస్ దాడి దారుణం

సమాజంలో నీతినిజాయితీ, విలువలు ఉన్నాయంటే అది ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశంపార్టీలోనే అని, ఎమ్మార్పీఎస్ దౌర్జన్యంగా టిడిపి భవనంపై దాడి చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని చేనేత వృత్తిదారుల ఐక్యవేదిక అధ్యక్షులు దోనేపూడి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హక్కుల కోసం పోరాడాలే గాని దౌర్జన్యం తగదని, టిడిపి కార్యాలయంపై దాడి బడుగు బలహీన వర్గాలను అవమానపరచడమౌతుందని ఆంధ్రప్రదేశ్ బిసి మహాసభ తెలిపిందని ఆయన అన్నారు.

# జడ్పీ వాకర్స్‌కు అంతర్జాతీయ అవార్డు



జడ్పీ వాకర్స్ సంఘం వారు ఇంటర్నేషనల్ క్లబ్ వారిచే ఉత్తమ సేవా అవార్డు పొందిన సందర్భంగా నెల్లూరు జడ్పీ హైస్కూలు ఆవరణలో ఈ నెల 16న మండువ శ్రీనివాసరావుకు అభినందన సభ జరిగింది. ఇటీవల మండువ శ్రీనివాసరావు విజయ నగరంలో జరిగిన వాకర్సు ఇంటర్నేషనల్ 23వ కన్వెన్షన్ 2014లో క్లబ్ అధ్యక్షులు పివిపి రాజు చేతులమీదుగా ఉత్తమ కార్యదర్శి అవార్డును అందుకున్నారు. అదేవిధంగా నడక పందెంలో అధ్యక్షులు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి కన్సోలేషన్ బహుమతిని, సభ్యులు చిన్న అల్లూరురాజు తృతీయ బహుమతిని ఇంటర్నేషనల్ వాకర్సు అధ్యక్షుల చేతుల మీదుగా అందుకున్నారు.

# తీర్థ చిల్డ్రన్స్ హోంలో రామానుజన్ డే

నెల్లూరు మనుమసిద్ధినగర్‌లోని తీర్థ చిల్డ్రన్స్ హైస్కూల్లో సోమవారం రామానుజన్ డేను జరుపుకున్నారు. ముందుగా విద్యార్థులు తయారు చేసిన అనేక గణిత ప్రయోగాలను ప్రదర్శించి వివరించారు. విద్యార్థులు గణితంలో క్విజ్‌ను నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ప్రసంగాలు, నాటకరూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ యం.ద్వారకానాథ్, ప్రిన్సిపల్ యం.సాయికుమారి, స్కూలు ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రామానుజన్ 1887లో తమిళనాడులో జన్మించి 1909లో వివాహమాడి 1914లో ఇంగ్లాండ్‌లో అనేక గణితపత్రాలను బ్రిటీష్‌వారికి అందించారన్నారు. భారతదేశానికి ప్రపంచ నలుమూలలా గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి రామానుజన్ అని కొనియాడారు. గణిత ఉపాధ్యాయులు పి.షమీర్, షేక్‌బాబు, పి.ధనలక్ష్మి, శ్రీదేవి, జయలక్ష్మి, హిమబిందు, సుభ్రమ్మలను తల్లిదండ్రులు అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# నెల్లూరులో తొలిసారిగా టెలీమెడిసిన్

గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు తక్కువ ఖర్చుతో ఆన్‌లైన్ వైద్యాన్ని అందించడానికి ఈ నెల 27వ తేదీన టెలిమెడిసిన్ సెంటర్‌ను వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రారంభిస్తున్నామని భార్గవ్ హెల్త్‌ప్లస్ వ్యవస్థాపకులు ఏ.సి.శేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థ కొత్తగా ఆన్‌లైన్ వైద్యాన్ని ప్రవేశపెట్టిందని, ఈ నెల 27వ తేదీన బుజబుజ నెల్లూరులో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.జానకి చేతులమీదుగా ఈ ఆన్‌లైన్ వైద్యాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ టెలిమెడిసిన్ ద్వారా ప్రముఖవైద్యులతో రోగులు నేరుగా మాట్లాడే అవకాశముంటుందన్నారు.

# సందడిగా క్రిస్టమస్ సంబరాలు

క్రిస్టమస్ పర్వదినం సందర్భంగా గురువారం క్రైస్తవులు తమ ఇళ్లను, ప్రార్థనా మందిరాలను స్టార్లు, ట్రీలు, విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చీలలో ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సువార్త కీర్తనలు ఆలపిస్తూ క్రీస్తు వైభవాన్ని తెలియజేశారు. క్రిస్టమస్ పండుగ సందర్భంగా నెల్లూరు నగరంలోని అన్ని దుకాణాలు కళకళలాడాయి. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లోని డౌనీహాలు, సంతపేటలోని బిషప్‌హౌస్ రోమన్‌క్యాథలిక్ చర్చి, ఏబీయం కాంపౌండ్‌లోని బాప్టిస్టు చర్చి, ఫతేఖాన్‌పేటలోని అంథోని చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మించిన తీరును వివరిస్తూ చేసిన పలు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వంద సంవత్సరాల చరిత్రగల డౌనిహాలు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్టమస్ కేక్‌ను కట్‌చేశారు.

బిషప్‌హౌస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు జనన



నమూనా విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. బట్వాడిపాళెం సెంటర్‌లో బాలఏసు జనియించిన తీరును వివరిస్తూ ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు చూపురులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం అన్ని చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

# చితికిన చిన్నారుల ఆశలు

భవిష్యతులో ఉన్నత శిఖరాలకు చేరుకుని భారతదేశానికి తమవంతు సేవలందించాలని కలలు కన్న చిన్నారుల ఆశలు చితికిపోయాయి. ఇంటినుండి తల్లిదండ్రులకు టాటా చెప్పిన కొద్ది క్షణాలకు ఆ చిన్నారుల పసిప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ వార్త విన్న తల్లిదండ్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. విషణ్ణవదనాలతో చూపరుల కళ్ళు చెమర్చాయి.

వివరాల్లోకి వెళితే నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తీపనూరు గ్రామానికి చెందిన విద్యార్థులు చిల్లకూరు గ్రామంలోని ఎస్ఆర్‌కె స్కూలుకు సోమవారం ఉదయం ఆటోలో బయలు దేరారు. రవీంద్రభారతి స్కూలు బస్సు విద్యార్థుల కోసం అదే గ్రామానికి వెళుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ముందు వరుసలో కూర్చున్న డి.వినయ్, యం.వెంకటేశ్వర్లు తలలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో వెనుకవైపు ఉన్న డిగ్రీ చదువుతున్న మరో ఐదుగురు విద్యార్థినులకు, ఆటో డ్రైవర్‌కి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆటో డ్రైవర్‌కు కాలు నలిగిపోవడంతో కాలు తీసే పరిస్థితి ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

ప్రమాద సంఘటన తెలుసుకుని జెసి రేఖారాణి, ఆర్డీఓ రవీందర్, డిఎస్పీ శ్రీనివాసులు మృతి చెందిన విద్యార్థులను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చారు. బస్సు డ్రైవర్‌పై కేసులు నమోదు చేసి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రభుత్వం విలవిల

(మొదటిపేజీ తరువాయి)

మరీముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయాలనే సంకల్పంతో రూపొందించిన సిఆర్‌డిఏ బిల్లును ఆమోదించడం కోసం ఈ సమావేశాలు నిర్వహించినట్లుందేగాని ఈ సమావేశాల ద్వారా మరో ప్రయోజనం కనిపించలేదు. రైతులను నోరు లేని జీవాల్లాగా చేసే ఈ బిల్లుపై కనీసం చర్చ కూడా జరగలేదు. ఇక ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో ప్రతిపక్ష వైకాపా సభ్యులు గత సమావేశాలలో కంటే మిన్నగా వ్యవహరించారు.

గత సమావేశాలలో ప్రధానప్రతిపక్ష నేత జగనే అంతా తానై వ్యవహరించారు. కాని ఈ సమావేశాలలో అలా జరగలేదు. విపక్ష సభ్యులు ఒక్కొక్కరు ఒక్కో అంశాన్ని ఎత్తుకుని ప్రభుత్వం మీద దాడి చేశారు. హుద్‌హుద్ తుఫాన్‌తో పాటు ఋణాల మాఫీ, పింఛన్‌లు, ఫీజురీయంబర్స్‌మెంట్ వంటి అంశాలపై విపక్ష సభ్యులు అధికార పక్షాన్ని తూర్పారబట్టారు. ఈసారి సమావేశాలలో విపక్ష సభ్యులు గతం కంటే ధాటిగా మాట్లాడి ప్రభుత్వాన్ని పలు సందర్భాల్లో ఇరుకున పెట్టారు. పలువురు మంత్రులు కూడా విపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక తడుము కోవాల్సివచ్చింది.

# భారత జాతి రత్నాలు

(మొదటిపేజీ తరువాయి)

విజ్ఞుడు.. అసమాన ప్రజ్ఞావంతుడు.. భారత రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి.. మహాతత్వవేత్త, విద్యావేత్త.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు.. పండిట్ మదన్‌మోహన్ మాలవీయలకు కేంద్రప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ప్రకటించింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోడి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. వీరిరువురి పేర్లను రాష్ట్రపతికి సిఫారసు చేయగా, కేంద్రం పంపిన ఈ నిర్ణయానికి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ వెంటనే ఆమోదముద్ర వేశారు. దేశమాత సేవలో పునీతమైన ఈ మహనీయులిద్దరికీ భారతరత్న ప్రకటించడం పట్ల దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, నాయకులు ఆనందాతిరేకాలను వ్యక్తం చేశారు. వీరిద్దరి పుట్టిన రోజు ఒకేరోజు కావడం, ఇద్దరికీ ఈ అత్యున్నత పురస్కారం అదే రోజు రావడం ఎంతైనా విశేషమే.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి గురువారం నాడు 90వ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రకటించడం వాజ్‌పేయికి ఇది జన్మదిన కానుకగా భావించవచ్చు. సుపరిపాలనకు మారుపేరైన వాజ్‌పేయి జన్మదినాన్ని ప్రభుత్వం 'సుపరిపాలనా దినోత్సవం'గా కూడా ప్రకటించి తన గౌరవాన్ని చాటుకుంది. అదేవిధంగా, స్వతంత్ర భారతావని కోసం గళమెత్తి, బెనారస్ విశ్వవిద్యాలయ స్థాపనతో విద్యా సుగంధ పరిమళాలను వెదజల్లిన దేశభక్తుడు, ప్రఖ్యాత విద్యావేత్త అయిన పండిట్ మదన్‌మోహన మాలవ్య 153వ జయంతి కూడా గురువారమే కావడం విశేషం. ఈ మహనీయులిద్దరికీ భారతరత్న ప్రకటించడం ఎంతో గర్వకారణం.

దేశంలో కాంగ్రెసేతర సంకీర్ణ ప్రభుత్వాన్ని పూర్తికాలం నిర్వహించిన తొలి ప్రధానిగా వాజ్‌పేయి అందరి ప్రశంసలూ అందుకున్నారు. ఆయన గొప్ప దార్శనికుడు కూడా. రాజకీయ రంగంలో అజాత శత్రువుగా పేరుతెచ్చుకున్న వాజ్‌పేయి మూడు సార్లు దేశప్రధానిగా బాధ్యతలు చేపట్టి, ఎలాంటి అవినీతి మరకలు అంటకుండా ప్రజలకు సుపరిపాలన అందించారు. కవితాత్మకంగా సాగే ఆయన ప్రసంగాలు, అమోఘమైన వాక్పటిమ ఆయన సొంతం. ఇతర పార్టీల నేతలు కూడా ఆయన రాజనీతిజ్ఞతను కొనియాడేవారు. సచ్ఛీలమైన రాజకీయాలకు ఆయన మారుపేరు. రాజకీయరంగాన్ని ప్రజాసేవారంగంగా భావించి ఆయన దేశానికి చేసిన సేవలు అపారం. భారతీయ జనతాపార్టీలో అత్యున్నత నేతగా వుంటూ ఆయన పార్టీలో అందరి ఆదరాభిమానాలను అందుకున్నారు. బిజెపి తరపున ప్రధాని పదవిని చేపట్టిన ప్రథమనేత కూడా ఆయనే. అంతేకాదు, పార్టీలకు అతీతంగా అందరి ఆమోదం పొందిన మహానేత ఆయన. ఒక్క మాటలో చెప్పాలంటే నిష్కల్మష రాజకీయ యోగి మహనీయుడు అటల్‌బిహారీ వాజ్‌పేయి. వాస్తవానికి వాజ్‌పేయికి భారత రత్న ఎప్పుడో ప్రకటించాల్సింది. ఆ మేరకు బిజెపి కూడా అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలుసార్లు కోరినా, ఆ ప్రభుత్వం ఆ విషయాన్ని కావాలనే విస్మరించిందని బిజెపి ఆవేదన. ఇప్పుడు ప్రధాని మోడీ నేతృత్వంలో వాజ్‌పేయికి భారతరత్న ప్రకటించడం.. ఆ రాజకీయ భీష్మునికి నిజంగా భారత జాతి జనులందరి తరపున కృతజ్ఞతా కుసుమాలను సమర్పించుకున్నట్లే.

ప్రఖ్యాత విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి పండిట్ మదన్‌మోహన్ మాలవ్య దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకునిగా, నాలుగు సార్లు భారతజాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా, ప్రముఖస్వాతంత్ర్య సమరయోధునిగా దేశానికి ఎనలేని సేవలు చేసిన మహోన్నత సేవామూర్తి ఆయన. దేశమాత సేవలో పునీతులైన ఆయన,. ఉపనిషత్తుల్లోని 'సత్యమేవ జయతే' అనే ప్రధానమైన సూక్తికి విశేష ప్రాచుర్యం కల్పించారు. ఆ ప్రాచుర్యమే గణతంత్ర భారతావనికి దానిని జాతీయలక్ష్యంగా మార్చింది. హిందూ సమాజం తొలితరం నేతగా ఆయన సామాజిక సంస్కరణల అమలుకు ఎంతగానో కృషి చేశారు.

ప్రధాని నరేంద్రమోడీ తన ఎన్నికల ప్రచారంలో కూడా పండిట్ మదన్‌మోహన్ మాలవ్య సేవలకు గుర్తింపుగా భారత రత్న పురస్కారం అందిస్తామని పేర్కొన్నారు. అనుకున్నట్లుగానే ఆ మహనీయునికి ఆ ఘనమైన పురస్కారం ప్రకటించి తన మాటను నిలబెట్టుకున్నారు. ఆయనతో పాటు నిష్కళంక రాజనీతిజ్ఞుడైన మాజీ ప్రధాని వాజ్‌పేయికీ ఈ అత్యున్నత పురస్కారాలను ప్రకటించడం ప్రధాని మోడీ నిలువెత్తు నిజాయితీకి, నిబద్ధతకు నిదర్శనమని వేరే చెప్పనక్కర లేదు. మహోన్నత నేత అయిన వాజ్‌పేయికి, స్వాతంత్ర్య సమరయోధుడైన మదన్ మోహన్ మాలవ్యకు భారతరత్న అవార్డులను ప్రకటించడం ఎంతో హర్షదాయకమని, ఇది సముచితమైన నిర్ణయమని, ప్రధాని మోడీని, ఆయన ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వాన్ని ప్రజలు, ప్రముఖులు అందరూ అభినందిస్తున్నారు.

## ఎంతో సంతోషదాయకం

**:ప్రధాని నరేంద్రమోడీ**

మానవీయమూర్తులైన పండిట్ మదన్ మోహన్‌మాలవ్య, అటల్‌బిహారీ వాజ్‌పేయిలకు భారతరత్న పురస్కారాలను ప్రకటించడం పట్ల ప్రధాని నరేంద్రమోడీ సంతోషం ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని వారికి ప్రకటించడం, దేశానికి ఆ మహానుభావులు చేసిన సేవలకు లభించిన సరైన గుర్తింపు అని ఆయన అభివర్ణించారు. గొప్ప పండితునిగా, ప్రజల్లో జాతీయవాదాన్ని రగుల్కొల్పిన స్వాతంత్ర్య సమరయోధునిగా మాలవీయ గుర్తుండిపోతారని ఆయన అన్నారు. అదేవిధంగా, మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా కొనియాడుతూ, ఒక దార్శనికునిగా, స్ఫూర్తి ప్రదాతగా ఆయన దేశానికి చేసిన సేవలు అమోఘమని ప్రధాని ప్రశంసించారు.

# కోటంరెడ్డి శాంతిసందేశంతో ఒక్కటైన నారాయణ, అనిల్

గల్పిక

బలిసిన పందులు, ముదురిన దోమల ఉత్పత్తి కేంద్రమైన నెల్లూరు మహానగరం. విఆర్‌సి మైదానం. గ్రౌండ్ చివర ఒక వేదిక ఏర్పాటు చేసి ఉన్నారు. ఆ వేదిక మీద బ్యానర్‌పై ఇలా వ్రాసి వుంది. "మంత్రితో నెల్లూరు జంట ఎమ్మెల్యేల సవాల్‌పై చర్చ" అని. పత్రికల వాళ్ళు, మీడియా అంతా వచ్చింది. కొద్దిసేపటికి తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాద్‌రావు, టి.రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నుండి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65), కొడవలూరు ధనుంజయరెడ్డి, బీజేపీ నుండి కర్నాటి ఆంజనేయరెడ్డి, సిపిఎం నుండి మోహన్‌రావు, సిపిఐ నుండి పముజుల దశయ్య వంటి వారంతా వచ్చి అతిథులకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు.

అప్పుడే అక్కడకు ముదురుదోమలశాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు వచ్చారు. ఈ సవాల్ చర్చావేదికను నిర్వహించడానికి హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా విచ్చేసిన టివి9 రజనీకాంత్ ముగ్గురినీ వేదికమీద నిలబెట్టి ముందుగా ఆయన మాట్లాడుతూ... ఈమధ్య కాలంలో ఈ ముగ్గురి మధ్య సినిమా డైలాగ్‌ల విమర్శలు ఎక్కువగా నడుస్తున్నాయి. ఒకరికొకరు సవాళ్లు విసురుకుంటున్నారు. ఆ డైలాగ్‌ల యుద్ధాన్ని ప్రజల మధ్యనే నిర్వహించాలనే ఉద్దేశ్యంతోనే ఈ వేదికను ఏర్పాటు చేయడం జరిగింది. వీరి రాజకీయ సినిమా డైలాగ్‌లను మీరే విని తరించండి అని పచ్చజెండా ఊపి... మొదట అనిల్‌ను మాట్లాడమని చెప్పాడు. నారాయణను ఉద్దేశించి అనిల్... నారు పోసావా, నీరు పెట్టావా, దుక్కిదున్నావా, ఎరువు వేసావా... నెల్లూరులో చిన్న మొక్కనన్నా నాటావా? ఎందుకు నీకీ మంత్రి పదవి అంటూ ఆర్.నారాయణ మూర్తి లెవల్లో డైలాగ్ వదిలాడు. వెంటనే మంత్రి రెండు సెకన్లు ఆలోచనలోకి వెళ్లాడు. వెంటనే ఆయనకు బాలకృష్ణ 'సింహా' సినిమా గుర్తుకొచ్చింది. రౌద్రంగా ముఖంపెట్టి "ఒక వైపే చూడు... రెండో వైపు చూడాలనుకోవద్దు... తట్టుకోలేవ్.. మాడి మసై పోతావ్..." అని ఆవేశంగా అన్నాడు. ఆ డైలాగ్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పందించాడు. ఆయన కూడా రెండు సెకన్లు ఆకాశంవైపు తల పెట్టి ఆలోచించాడు. వెంటనే 'నరసింహా' సినిమాలో రజనీకాంత్ డైలాగ్ గుర్తుకొచ్చింది. "అన్నా అతిగా ఆశపడే ఆడది.. అతిగా ఆవేశపడే మగాడు బాగుపడినట్లు చరిత్రలో లేదు...", ఆవేశం వద్దన్నా అని అన్నాడు. వెంటనే క్రింద నుండి చాట్ల నరసింహారావు లేచి... శ్రీధర్ నీ డైలాగ్ తప్పు... రజనీకాంత్ చెప్పింది "అతిగా ఆశపడే మగాడు... అతిగా ఆవేశపడే ఆడది" అని చెప్పాడు. దానికి కోటంరెడ్డి... ఏదో నాకు సినిమా నాలెడ్జ్ తక్కువ లేన్నా... అయినా అది ఇటు, ఇది అటు మార్చుకోండి, సరిపోతుల్లేదా అని చెప్పి కూర్చున్నాడు.

తర్వాత అనిల్ వంతు వచ్చింది. మంత్రివై ఆరు నెలలయ్యింది. రోడ్డు వేసావా, నీళ్లు తెచ్చావా, ఒక్క ఇటుక రాయి పని చేసావా? ఒక్క తట్ట మట్టిపనన్నా చేసావా? ఏం పీకారని మీరు మంత్రి పదవిలో వున్నారని డైలాగ్ వదిలాడు. ఆ డైలాగ్‌కు వైకాపా నాయకులు, కార్యకర్తల కంటే కూడా తెలుగుదేశం ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనుచరులు ఎక్కువగా చప్పట్లు కొట్టారు. అనిల్ డైలాగ్‌కు మంత్రి వెంటనే ఆలోచనలోకి వెళ్లాడు. 'అత్తారింటికి దారేది' సినిమా జ్ఞాపకానికొచ్చింది. 'సింహంతో ఆటా నాతో వేట ఒకటే... సింహంతో ఫోటో దిగాలనిపించిందా దిగు.. అంతేగాని సింహం జూలును పట్టుకుని ఆడుకోవాలనుకోకు... సింహం నేను సేమ్ టు సేమ్, కాకపోతే నేను గడ్డం గీసు కుంటాను, అది గీసుకోదు అంతే తేడా" అనే డైలాగ్‌ను వదిలాడు. ఇప్పుడు కోటంరెడ్డి వంతు రావడంతో ఆయన లేచి... 'గాంధీ' డైలాగ్‌లు చెప్పసాగాడు. మంత్రి గారు... మీరు ఒక చెంప మీద కొడితే మేము రెండో చెంప చూపిస్తాము... సత్యమే మా మార్గం... అహింసే మా ఆయుధం. ఈ రక్తపాతాలు, నేరాలు, ఘోరాలు ఎందుకు చెప్పండి... వీలైతే సాటి మనిషిని ప్రేమించండి అని బాపూజీ లెవల్లో చెప్పాడు. వెంటనే అనిల్ ఆగ్రహంగా లేచి... ఏందన్నా ఆయనతో మనకు శాంతి చర్చలు... అయినా ఈ తొక్కలో మీటింగ్ ఏంటో నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ మొత్తం కలిపితే పదిమంది లేరు... మీరు ఊ.. అంటే రఫ్ ఆడిచేస్తా అంటూ 'పోకిరి' సినిమా డైలాగ్ వదిలాడు. అప్పుడు అనిల్‌ను కోటంరెడ్డి... భాయ్ కూర్చో కూల్... కూల్ అంటూ శాంత పరిచాడు. వెంటనే కోటంరెడ్డికి 'మిర్చి' సినిమాలో నాజర్ తన కొడుకును ఓ పంపు వద్దకు తీసుకెళ్లి చేతిలో నీళ్ల పోసే సన్నివేశం గుర్తుకొచ్చింది. వెంటనే అనిల్ చేతిని మడిచి బాటిల్‌లో వున్న నీటిని అతని దోసిట్లో పోసాడు. ఈ దోసిడిని నువ్వు ఎంతో బలంగా బిగిస్తే అంత నీళ్లు నిలుస్తాయి... అలాగే నీ ఫ్రెండ్స్ కూడా అంతే... నువ్వు ఎంతగా సర్దుకుపోతే నీకు అంతఎక్కువ మంది ఫ్రెండ్స్ అవుతారని చెప్పాడు. దానికి అనిల్ కోపంతో... నువ్వు ఎప్పుడూ ఇంతేనన్నా, నాకు గెలుపంటే ఇష్టం, నువ్వేమో అందరితో అడ్జస్ట్‌మెంట్ అయిపోతుంటావని అన్నాడు.

కోటంరెడ్డి శాంతి చర్చలు ఫలిస్తే చర్చావేదిక చప్పగా ఉంటుందని భావించిన టివి9 రజనీకాంత్... వెంటనే నారాయణతో... సార్, మీరు చెప్పండి, వాళ్లిద్దరూ మీ మీద యుద్ధం ప్రకటించారు. మీరు రెండో వైపు చూడొద్దు అంటే వాళ్లు, రెండు, మూడు కాదు, నాలుగోవైపు కూడా చూపించమంటున్నారు. మీతో ఎక్కడైనా తేల్చుకోవడానికి సిద్ధమంటున్నారు. దీనిపై మీ స్పందనేంటి అని రెచ్చగొట్టాడు. అప్పుడు నారాయణ... ఎక్కడో ఎందుకు సీమ గొందుల్లో కాదు సింహపురి సందుల్లో తేల్చుకుందాం.. మీ ప్రతాపమూ... నా ప్రతాపమూ.. నేను గట్టిగా తొడగొట్టానంటే ఆ సౌండ్‌కే మీరిద్దరూ బొల్లినేని ఆసుపత్రిలో చేరుతారని అన్నాడు. ఆ డైలాగ్‌కే కోటంరెడ్డికి భయమేసి, చలిజ్వరం వచ్చినట్లు గడగడ వణక సాగాడు. కాని అనిల్ ఏ మాత్రం తగ్గకుండా... సమరసింహారెడ్డి డైలాగ్‌ను గుర్తుకు తెచ్చుకుని... సింహపురి సందుల్లో కాదు... మీ ఆసుపత్రి కొస్తా, మీ ఏరియాకొస్తా... మీ ఇంటి కొస్తా... మీకు చేతనైంది చేసుకోండి.. అనే డైలాగ్ చెప్పాడు. వెంటనే నారాయణకు 'అతడు' సినిమా గుర్తొచ్చింది. బాబూ అనిల్... గన్‌ను చూడాలనుకో తప్పులేదు... కాని బుల్లెట్‌ను చూడాలనుకోకు... అని చెప్పాడు. మధ్యలో కోటంరెడ్డి భయంతో వణుకుతూనే కల్పించుకుని... ఈ గన్‌లు, బుల్లెట్‌లు మనకు అవసరమా సార్... 'చంపుకుంటూ పోతే వూర్లు వుండవ్... శ్మశానాలే మిగులుతాయ్... "మనం అవతలి మనిషిని ప్రేమిద్దాం... మహా అంటే వాళ్లు కూడా మనల్ని ప్రేమిస్తారు" అని 'మిర్చి' సినిమా డైలాగ్ వదిలాడు. దానికి అనిల్... ఏందన్నా మీరేమో శాంతి, శాంతి అంటున్నారు. ఆయనేమో తొడ కొడితే మనం ఆసుపత్రిలో చేరుతామంటున్నాడు. మీ శాంతి సిద్ధాంతాలను ఒక్క గంట పక్కనపెట్టి ఇంట్లో కూర్చోండి, మనమేంటో చూపిస్తాం అంటూ మిర్చి సినిమాలో ప్రభాస్ లాగా ఆవేశంతో చెప్పాడు. అప్పుడు నారాయణ కూడా... మాట తప్పడం, మడమ తిప్పడం నా చరిత్రలో లేదు... అంటూ 'నరసింహనాయుడు' సినిమా గుర్తుకు రావడంతో... 'కత్తులతో కాదురా... కంటి చూపుతో చంపేస్తా' అనే డైలాగ్ వదిలాడు. అసలే పులులను చూసిన లేడిపిల్లల్లా బెదిరిపోతున్న కోటంరెడ్డి ఆ డైలాంగ్‌తో మరింత వణికిపోసాగాడు. అంత భయంలోనూ ఆయనకు మెరుపులాంటి ఆలోచన మెదడుకు తట్టింది.

గబగబ వేదిక దిగాడు. అన్నా, ఒక అరగంటలో తెచ్చిస్తాను అంటూ స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా కళ్లకున్న నల్లద్దాలను తీసుకుని వేదికనెక్కాడు. వెంటనే వాటిని మంత్రి నారాయణ కళ్లకు పెట్టాడు. కోటంరెడ్డి అలా ఎందుకు చేసాడో ఎవరికీ అర్థం కాలేదు. నారాయణ వుండి... నాకెందుకు ఈ అద్దాలు పెట్టావని అడిగాడు. అందుకు కోటంరెడ్డి.. కంటిచూపుతో చంపేస్తారన్నారు కదన్నా... ఎక్కడ మీ కళ్లల్లోకి చూస్తే నేనేమవుతానోనని భయపడి అలా చేసానన్నాడు. అప్పుడు నారాయణ కొంత శాంతించి... నీ భాదేంటో చెప్పు అని అడిగాడు. నా భాదేంలేదన్నా, మనమంతా ఐక్యంగా వుండి నెల్లూరు అభివృద్ధికి పాటుపడదాం. మనం తన్నుకుంటే నెల్లూరును పట్టించుకునేదెవరు? శాంతంగా వుందాం, సహనంగా జీవిద్దాం, సమైక్యంగా ముందుకుపోదాం... "ప్రేమే లక్ష్యం – సేవే మార్గం" అని గత ఎన్నికలప్పుడే చిరంజీవి స్లోగన్ ఇచ్చాడు కదన్నా అని కోటంరెడ్డి చెప్పాడు. సరే, ఆ శాంతించమనేదేదో ఆయనకు కూడా చెప్పు అంటూ అనిల్‌ను చూపించాడు. అనిల్‌తో కోటంరెడ్డి... తమ్ముడూ, మనతో ఎవరికీ వ్యక్తిగత కక్ష్యలు లేవు, రక్తపాతాలు, మారణహోమాలు, మారణాయుధాలు మనకొద్దు. జీసెస్ బోధించిన శాంతి మంత్రంతో, బాపూజీ చూపించిన అహింసా సిద్ధాంతంతో, మథర్‌థెరిస్సా నడయాడిన సేవామార్గంలో మనమంతా నడిచి నెల్లూరు అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చాడు. ఆయన పిలుపుకు వాళ్లిద్దరూ మౌనమే అంగీకారం అన్నట్లుగా ఉండిపోయారు. తర్వాత కోటంరెడ్డి ఓ పక్క నారాయణ, ఇంకోపక్క అనిల్‌ను నిలబెట్టుకుని ముగ్గురూ కలిసి చేతులు పైకెత్తి... ఇక నుండి నెల్లూరు అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అంతా అయ్యాక... టివి9 రజనీకాంత్... ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెలిసినోడే హీరో... ఆ పని ఈరోజు కోటంరెడ్డి చేసాడని ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ప్రకటించి కార్యక్రమాన్ని ముగించారు.

కదంబం

## ముక్కుంటే ముక్కెర ఉచితం

– ఏటూరి నాగేంద్రరావు
నెల్లూరు. 7416665323.

మార్కెట్ పిచ్చి
దేవుడికీ పట్టుకుందని
తెలుసుకునేసరికి ఆలస్యమైపోయింది.
వంశోద్ధారకుడి కోసం
వొక్క నలుసు చాలని పోరాడితే
ఇంకొకర్ని ఉచితంగా ఇచ్చాడు!
వొకటి కొంటే వొకటి ఫ్రీ
మార్కెట్ మాయా జాలం
వొకర్ని కంటే కవల ఫ్రీ
దేవుడి ఇంద్రజాలం!
ఇంకా నయం –
నా పెళ్లి రోజుల్లో ఈ ఆఫర్ లేదు
నా అదృష్టం గట్టిది.
మా మావయ్యకి వొక్కతే కూతురు!
లేకుంటే నా బతుకు నిండా
సవతుల పోరు సీన్లే నిండేవి.
అధికారపక్షం – ప్రతిపక్షం
నా ఇంట్లోనే మకాం పెట్టేవి.
ఇల్లు అసెంబ్లీ హాలయ్యేది
పక్కింటోళ్లు పత్రికా విలేకర్లయ్యేవారు.
స్పీకర్‌గా నేను –
నూనెలో పొంగిన బూరెనై వుండేవాణ్ణి
ఇంటి నిండా తిట్లవాన
తలనిండా బొప్పిగడ్డలు!
చించి, చించి ఆలోచించి చూస్తే
బడ్జెట్లో మాత్రం పెద్ద తేడా లేదు.
ఖర్చుల లిస్టు పెరగదు.
డబ్బుకు కాళ్లు మొలవ్వు
చీర కొంటే చీర ఫ్రీ
రవిక కొంటే రవిక ఫ్రీ
ముక్కెర కొంటే ముక్కెర ఫ్రీ
స్ప్రే కొంటే స్ప్రే ఫ్రీ
కిచెన్లో చికెన్ ఫ్రీ,
ఇన్ని ఫ్రీల వెర్రిసీజన్లో
వొంటికొయ్య మావయ్య కూతుర్ని కట్టుకొని
ఫ్రీ ఛాన్సు మిస్సయ్యానేమో!
అయినా అదృష్టవంతుణ్ణే లెండి
కృష్ణుడిలా ఎనమండుగురు కాకపోయినా
ఇద్దరి ప్రేమను మిస్సయ్యానేమో!
ఒక్క భార్యతోనే ఇప్పుడు నాకు సగం బట్టతలే!

సకల పాప విమోచనం..

## భగవన్నామ సంకీర్తనం

భగవన్నామ సంకీర్తనం సకల పాప విమోచనమనే విషయాన్ని గోదాదేవి అమ్మవారు తిరుప్పావైలో స్పష్టంగా వెల్లడించారని నెల్లూరులోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసఅయ్యంగార్ అన్నారు. మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాల్లో భాగంగా ఈ నెల 20న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భగవన్నామ సంకీర్తనం ఎంత గొప్పదో గోదాదేవి పేర్కొన్న అనేక విషయాలను ఆయన భక్తులకు వివరించారు. భక్తితోనే భగవంతుని ప్రేమను, ఆయన కృపను పొందవచ్చని గోదాదేవి తన భక్తితత్వంతో నిరూపించిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తిరుప్పావై ప్రవచనాలను విని, అనంతరం దైవదర్శనం చేసుకున్నారు.

## అయ్యప్పస్వామికి సేవా మహోత్సవం

నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న మండల పూజ మహోత్సవాల్లో భాగంగా 21వతేదీ భగవతిసేవ, శ్రీవేలి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ స్వామిఅయ్యప్ప సేవాసమాజం అధ్యక్షుడు పిటి రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావు నేతృత్వంలో మూలవర్లకు క్షీరాభిషేకం, నవకాభిషేకం, పూలంగిసేవ, అత్తాళి పూజా మహోత్సవాలు కనులవిందుగా జరిగాయి.



***శ్రీ గోదాదేవికి ఊంజల్ సేవ:*** అయ్యప్పగుడి ప్రాంగణంలోని శ్రీ గురువాయూర్ మహావిష్ణువు దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా 21వతేదీ ఆండాళ్ గోదాదేవికి నిర్వహించిన ఊంజల్ సేవ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామి అయ్యప్పసేవా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి కట్టా చంద్రశేఖరరెడ్డి, లక్ష్మీ కైంకర్యకర్తలుగా వ్యవహరించారు.

## అసెంబ్లీలో మనోళ్ళు...



# సమస్యలపై నోరు తెరిచారు

**శీతాకాల శాసనసభ సమావేశాలలో నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేలు సమస్యలపై బాగా స్పందించారు. ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు.**

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ ఈ సమావేశాలను బాగా వినియోగించుకున్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌తో పాటు పలు సమస్యలపై ఆవేశపూరితంగా మాట్లాడి ఫోకస్ అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వంపై పరుషపదజాలంతో విరుచుకుపడ్డారు. బి.సి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదంటూ ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ సమస్యపై గళమెత్తారు. నెల్లూరు ప్రజల దాహార్తి తీర్చేందుకు దివంగత నేత వై.యస్. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు మంజూరు చేశారని, ప్రస్తుతం ఆ ట్యాంకులో నీళ్లు తాగితే ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి ఉందని ఆయన వివరించారు. ఈ ట్యాంకు గురించి మంత్రులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. అదే విధంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు, నెల్లూరు మాస్టర్‌ప్లాన్ వంటి వాటిపై కూడా ఆయన మాట్లాడారు.

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సాగునీటి సమస్యను ప్రస్తావించారు. కావలి కాలువను బాగుచేయకపోవడంతో రైతులు మూడేళ్లుగా నష్టపోతున్నారన్న విషయాన్ని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో రైతాంగానికి సంబంధించిన సాగునీటి సమస్యలను గురించి సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రస్తావించడం జరిగింది. సంగం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలు వేసి నీటి మట్టాన్ని పెంచి కనుపూరు కాలువకి నీరు అందించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని, అదేవిధంగా ఇతర మండలాలకి సంబంధించిన ప్రధాన కాలువలకు నిర్వహణ మరమత్తుల క్రింద నిధులు మంజూరు చేయకపోవడం వలన నాచు, గుర్రపుడెక్కలతో కాలువలు నిండి ఉన్నాయని, వీటి ఫలితంగా సాగునీరు సాఫీగా అందక వరినాట్లు వేసుకోలేని పరిస్థితిలో రైతులున్నారని తెలియజేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో చర్చించేందుకు ప్రయత్నిస్తే, జిల్లా పర్యవేక్షక ఇంజనీరు వారి ఫోను సేవలు నిలిపివేయడం జరిగిందని సమాధానం వచ్చిందని, కొంతమంది డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని సర్వేపల్లి రైతాంగానికి నీరందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గూడూరు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను లేవనెత్తారు. ఈ సమావేశాలలో సమస్యలను సభముందుకు తీసుకురావడంతో మన జిల్లా ఎమ్మెల్యేలు ఈసారి ఫర్వాలేదనిపించారు.

# ప్రభుత్వం చొరవతో పేదలకు సంక్రాంతి పండుగ

నిరుపేదల కుటుంబాల్లో సంక్రాంతి పండుగ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కలుగజేసింది. సంక్రాంతి పండుగ కానుకగా రూ.220లు విలువైన నాలుగు రకాల నిత్యావసరాలను ఉచితంగా అందజేయనుంది. నెల్లూరుజిల్లాలో దాదాపు 8.34లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ప్రతినెలా అందించే రేషన్ సరకులకు అదనంగా ఉచితంగా జనవరి నెలలో నాలుగు రకాలను అందజేయనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం శాసనసభలో ప్రకటించారు. జిల్లాలో ఉచితంగా అందజేసే సరకుల విలువ దాదాపు రూ.18.34కోట్ల మేర ఉండనుంది. ప్రతి కుటుంబానికి సంక్రాంతి ప్రత్యేక కానుకగా 20కిలోల బియ్యం, కిలో గోధుమపిండి, అరకిలో పంచదార, 100గ్రాములు నెయ్యి అందజేయనున్నారు. నాలుగు రకాల సరకుల విలువ రూ.220లు ఉంటుంది. జిల్లాలో దాదాపు 8.34లక్షల కార్డుదారులున్నారు. జనవరి మొదటి వారంలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. నెలసరి కోటాతో పాటు అదనంగా ఇవి అందనున్నాయి.

# కమనీయంగా శ్రీనివాస కళ్యాణం



శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నెల్లూరు టిటిడి కళ్యాణ మండపంలో శ్రీవారి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మప్రచారపరిషత్, థార్మిక సలహామండలి సంయుక్తంగా ఈ వేడుకను నిర్వహించాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వామిఅమ్మవార్లను వేదికపై అలంకరించి వేదమంత్రాలతో కళ్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తొలుత అర్చకస్వాములు వేదగిరి ఫణిశర్మ వారి బృందం స్వామి వారికి తిరుమంజనం, అభిషేకం సేవలు నిర్వహించారు. అనంతరం బాలభోగం ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. అన్నమాచార్య బిరుదాంకితులు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గురవయ్యను ధర్మప్రచార మండలి వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 70సంవత్సరాలు దాటిన 80మంది వృద్ధులకు వేదపండితులచే వేదాశీర్వాదం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు నలుబోలు బలరామయ్యనాయుడు–పద్మావతి, నలుబోలు కామేశ్వరరావు – భారతి, నలుబోలు వెంకట్రామిరెడ్డి – శైలజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో థార్మిక సలహామండలి సభ్యులు సి.వి.సుబ్రహ్మణ్యం, వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, శేఖర్‌రెడ్డి, వి.ధనుంజయ, నాగార్జునాచారి, మల్లెల శ్రీహరి, గిరిజ, ఆలూరు శిరోమణిశర్మ, వేణుగోపాల్, దుర్గాప్రసాద్, ఏ.బాలాజీ, పి.సూర్యనారాయణ, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### తపాలా శాఖలో
# ప్రజలకు అన్ని రకాల సేవలు

తపాలా శాఖలో ప్రజలకు అన్ని రకాల సేవలు లభించడంతో పాటు అంతర్జాతీయ సేవలు అందుబాటులో ఉన్నాయని నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్ పి.విశ్వనాథం తెలిపారు. ఐఎంపిఎస్ ద్వారా విదేశాల్లో ఉన్నవారు పంపిన నగదును ఇక్కడ తీసుకోవచ్చన్నారు. వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్ సేవలు అత్యధికంగా వినియోగించుకున్న పలువురు ఖాతాదారుల కోడ్ నెంబరు ఆధారంగా కార్యాలయంలో మంగళవారం లాటరీ నిర్వహించి లక్కీడిప్ ద్వారా విజేతను ప్రకటించారు. విజేతగా నిలిచిన నెల్లూరు తిప్పరాజువారివీధికి చెందిన సునీతకు వాషింగ్‌మిషెన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరావు పోస్ట్‌మాస్టర్ శ్రీధర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఏఎస్‌పి మురళీ తదితరులు పాల్గొన్నారు.


నూతన సంవత్సర మరియు ఓం సంక్రాంతి శుభాకాంక్షలు

మా "మురళీకృష్ణ" నేతి మిఠాయిలతో మా ఆత్మబంధువులు, కస్టమర్ దేవుళ్ళు అందరూ
ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా, తియ్యతియ్యగా ప్రారంభించాలని కోరుకుంటూ...

స్వీట్స్ గిఫ్ట్‌ప్యాకింగ్ బాక్స్‌లలో లభించును



డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేదీ మాత్రమే

మురళీకృష్ణ నేతిమిఠాయిలు
మద్రాస్‌బస్టాండ్ దగ్గర, నెల్లూరు. ఫోన్. 2336616, 2326888.



మరియు ఆర్టీసీ ఎదురుగా వున్న మురళీకృష్ణ ఘీస్వీట్స్ మరియు మాగుంట లే అవుట్‌లోని
"నిర్వాణ రెస్టారెంట్" నందు కూడా లభించును. ఫోన్: 2346544.


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com